Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

శుక్రవారం
6 సెప్టెంబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్


సంపుటి : 8
సంచిక : 120
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar




## ప్రభుత్వ విద్యాసంస్థలకు ఇక ఉచిత విద్యుత్

- జీవో జారీ చేసిన సర్కారు
- రాష్ట్రంలో 27,862 విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా: భట్టివిక్రమార్క
- తమ ప్రభుత్వం గురువులకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందన్న భట్టివిక్రమార్క
- మన విద్యా వ్యవస్థ ఇంకా మారాల్సి ఉందన్న ఉపముఖ్యమంత్రి
- అందుకే స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి

**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలంగాణలోని మొత్తం 27, 862 ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచితం గా విద్యుత్ సరఫరా చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్ర ఁమంలో ఆయన మాట్లాడుతూ... గురువులకు తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తెలంగాణలో పలు ప్రాంతాల్లో భారీ - మిగతా3లో

## ఏఐ అంతర్జాతీయ కేంద్రంగా

# హైదరాబాద్

- ఎన్నికలకు ముందు చెప్పినట్లు ఏఐకి తొలి ప్రాధాన్యత ఇస్తున్నాం: రేవంత్ రెడ్డి
- గ్లోబల్ ఏఐ సదస్సులో 'ఫ్యూచర్ సిటీ' లోగోను ఆవిష్కరించిన సీఎం
- సరికొత్త ఆవిష్కరణలు ప్రపంచాన్ని మార్చివేశాయి




**శుభ తెలంగాణ హైదరాబాద్**

ఎన్నికలకు ముందు డిక్లరేషన్‌లో చెప్పినట్లుగా ఏఐకి తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ ఏఐ' సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మించబోయే 'ఫ్యూచర్ సిటీ' లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... సరికొత్త ఆవిష్కరణలు ప్రపంచాన్ని మార్చివేశాయన్నారు. నేటి తరం అద్భుత ఆవిష్కరణే ఏఐ అని పేర్కొన్నారు. కొత్త కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో మార్పును తీసుకువస్తాయన్నారు. అవి ఆశలతో పాటు భయాన్ని కూడా తీసుకువస్తాయన్నారు. కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తాయని.. సరికొత్త ఆవిష్కరణలు ప్రపంచాన్ని మార్చాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'గ్లోబల్ ఏఐ' సదస్సుకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐ రోడ్ మ్యాప్ ఆవిష్కరించారు. ఈ సదస్సుకు వివిధ ఐటీ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. రాబోయే రెండు, మూడేళ్లలో రాష్ట్రంలో ఏఐ అభివృద్ధికి - మిగతా3లో


## మరమ్మతులు, పునరుద్ధరణకు టెండర్లను పిలవండి



- రెగ్యులేటరీలు, షట్టర్లు పనిచేస్తున్నాయా లేదా అన్న పరిశీలన కనిపించలేదు
- తద్వారా విపత్తులు సంభవించినప్పుడు దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి
- పాక్షికంగా దెబ్బతిన్న చెరువులు, కాలువల మరమ్మతులకు కూడా టెండర్ల ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలి
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

**శుభ తెలంగాణ హైదరాబాద్**

భారీ వర్షాలకు తెగిపోయిన చెరువుకట్టలు, కెనాల్స్ పునరుద్ధరణకు వారం రోజుల్లో టెండర్లు పిలవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో సంభవించిన వర్షపు ఉధృతికి జరిగిన నష్టంపై గురువారం నాడు నీటిపారుదల శాఖాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జలసౌధలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులు, కాలువల పునరుద్ధరణతో పాటు పాక్షికంగా దెబ్బతిన్న చెరువులు, కాలువల మరమ్మతులకు కూడా టెండర్ల ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలన్నారు. వెంటనే పాలనాపరమైన అనుమతులు తీసుకుని శుక్రవారం ఉదయానికి ఆన్‌లైన్‌లో టెండర్లు అప్‌డేట్ చెయ్యాలని మంత్రి అధికారులకు సూచించారు. ఇంతటి వర్షపు ఉధృతిలోనూ విధుల్లో నిమగ్నమయి పనిచేసిన నీటిపారుదల శాఖా సిబ్బందిని ఆయన అభినందించారు. అయితే అదే సమయంలో తాను స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటించినప్పుడు కొన్ని వాస్తవాలు వెలుగు చుశాయన్నారు. రెగ్యులేటరీలు, షట్టర్లు పనిచేస్తున్నాయా - మిగతా3లో




## ఉక్రెయిన్‌తో యుద్ధం.. భారత్‌తో టచ్‌లో ఉన్నాం

- ఉక్రెయిన్ అంశంలో భారత్‌తో నిరంతరం సంప్రదింపులు జరుగుతుంది
- యుద్ధ సమస్యను పరిష్కరించేందుకు భారత్ చాలా నిష్టతో పనిచేస్తున్నాం
- చర్చలతో సమస్యను పరిష్కరించాలన్న ఆలోచన ఉక్రెయిన్‌కు ఉంటే, దానికి తాము సిద్దంగా ఉన్నాం
- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్



## భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి నీటి ప్రవాహం

- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- గంట గంటకు పెరుగుతున్న వరద ప్రవాహం
- దవళేశ్వరం బ్యారేజ్ నుంచి 8 లక్షల 37వేల క్యూసెక్కులు సముద్రంలోకి

**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాల్లో కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరిలో వరద ఉద్ధృతి పెరుగుతోంది. మంగళవారం రాత్రి 41 అడుగుల నీటిమట్టం నమోదు కాగా..బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు 43 అడుగులకు చేరింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక - మిగతా3లో

## కేసీఆర్ మౌనమే


# వ్యూహమా?

- కవిత జైలు నుంచి వచ్చిన తర్వాత ఆయన కార్యచరణ ఉంటుందని.. వెంటనే రైతుల కోసం టూర్ కి వెళ్తారని బీఆర్ఎస్ వర్గాలు లీక్ ఇచ్చాయి.
- కానీ అది లీక్ గానే మిగిలింది .ఆయన సైలెంట్ గానే ఉన్నారు.
- అయితే రైతు రుణమాఫీ ఇతర అంశాలపై కాంగ్రెస్ తీరును ఎండగట్టేందుకు కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లేందుకు రెడీ అయ్యారు
- రూట్ మ్యాప్ పై కసరత్తు కూడా చేశారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.



**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ చాలా రోజుల తర్వాత ఇటీవల బయట కనిపించారు. బయట అంటే.. ఆయన ఫామ్ హౌస్‌లోనే జైలు నుంచి వచ్చిన కుమార్తెకు స్వాగతం చెబుతూ కనిపించారు. ఆ దృశ్యాలు బయటకు వచ్చాయి. అప్పటి వరకూ దాదాపుగా రెండు నెలలు ఆయన బయట కనిపించకపోయే సరికి ఆరోగ్యం బాగో లేదన్న పుకార్లు కూడా వచ్చాయి. కానీ కేసీఆర్ వేటినీ పట్టించుకోలేదు. బయటకు రాలేదు. కవిత జైలు నుంచి వచ్చిన తర్వాత ఆయన కార్యచరణ ఉంటుందని.. వెంటనే రైతుల కోసం టూర్ కి వెళ్తారని బీఆర్ఎస్ వర్గాలు లీక్ ఇచ్చాయి. కానీ అది లీక్ గానే మిగిలింది .ఆయన సైలెంట్ గానే ఉన్నారు. ఇంతటి వరదలు వస్తే ప్రతిపక్ష నేత కేసీఆర్ కనీసం బయటకు వచ్చి కూడా చూడలేదని.. అలాంటి ప్రతిపక్షానికి తాము ఎలా సమాధానం చెప్పాలని - మిగతా3లో



## పదేండ్లలో 32 రెట్లు పెరిగిన సౌరశక్తి సామర్థ్యం

- గత పదేండ్లలో దేశం గ్రీన్ ఎనర్జీలో ఎంతో పురోగతి సాధించింది
- ఈ వేగం, విస్తృతితో భారత్ 2030 నాటికి 500 గిగావాట్ల నాన్ ఫాసిల్ సామర్థ్యాన్ని సాధిస్తుంది
- ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సంస్కృతులు సూర్యుడిని వారి వారి పద్ధతుల్లో గౌరవిస్తాయి
- పునరుత్పాదన ఇంధనలో ప్యారిస్ ఆశయాలను సాధించిన తొలి జీ20 దేశం భారత్

# భారత్‌లో సింగపూర్ భారీగా పెట్టుబడులు


**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు రోజుల సింగపూర్ పర్యటనలో ఉన్నారు. బుధవారం సింగపూర్ చేరుకున్న ఆయనకు అఖండ స్వాగతం లభించగా, గురువారం సింగపూర్ పార్లమెంట్‌లో కూడా ఘనస్వాగతం లభించింది. అంతకుముందు ప్రధాని మోదీ బ్రూనైలో పర్యటించారు. ఇక, రెండో రోజు సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో ప్రధాని మోదీ ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.ఆ తర్వాత సింగపూర్ పార్లమెంట్‌కు చేరుకున్న ప్రధాని మోదీ అక్కడ సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, ఇతర ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమయంలో, సెమీకండక్టర్లకు సంబంధించిన ప్రధాన ఒప్పందంతో సహా రెండు దేశాల మధ్య అనేక ముఖ్యమైన ఒప్పందాలు జరిగాయి. డిజిటల్ టెక్నాలజీ, హెల్త్, ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో భారత్, సింగపూర్ మధ్య ఒప్పందాలు కూడా కుదిరాయి. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, లారెన్స్ వాంగ్ నాయకత్వంలో సింగపూర్ మరింత వేగంగా పురోగమిస్తుందని కొనియాడారు. సింగపూర్ ఒక దేశం మాత్రమే కాదు, అభివృద్ధి చెందుతున్న ప్రతి దేశానికి సింగపూర్ స్ఫూర్తి. భారతదేశంలో కూడా అనేక సింగపూర్‌లను సృష్టించాలనుకుంటున్నామన్నారు ప్రధాని మోదీ. ఈ దిశలో రెండు దేశాలు కలిసి పని



చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. భారతదేశం-సింగపూర్ ద్వైపాక్షిక సంబంధాల 60వ వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఈ పర్యటన జరుగుతోంది, ఇది రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను మరింత బలోపేతం చేయడానికి ఉద్దేశించింది. ఈ పర్యటనలో ప్రధాని మోదీ సింగపూర్‌లోని వ్యాపారవేత్తలు, పెద్ద కంపెనీల సీఈవోలతో సమావేశమయ్యారు. దక్షిణ చైనా సముద్రం, మయన్మార్ వంటి ప్రాంతీయ అంశాలపై చర్చించారు. సింగపూర్ యాఇంఔ దేశాలలో భారతదేశం అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ప్రపంచంలో భారతదేశం ఆరవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. సింగపూర్ భారతదేశానికి ఎఫ్‌డిఐకి ప్రధాన వనరుగా ఉంది. సెమీకండక్టర్ రంగంలో 20 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉంది.భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు తమ నిబద్ధతను తెలియజేసేందుకు అనేక ప్రముఖ సింగపూర్ కంపెనీలకు చెందిన టాప్ సీఈవోలు ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బ్లాక్‌స్టోన్ సింగపూర్, టెమాసెక్ హోల్డింగ్స్, సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, క్యాపిటా ల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్, ూు టెలిమీడియా గ్లోబల్ డేటా సెంటర్స్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ మరియు ఇతర ప్రముఖ కంపెనీలకు చెందిన నాయకులు ఉన్నారు. చర్చల సందర్భంగా, తమ ఆర్థిక సహకారాన్ని పెంపొందించడానికి, భారతదేశంలోని విభిన్న రంగాలలో పెట్టుబడులు పెట్టడానికి తమ నిబద్ధతను స్పష్టం చేశారు. ప్రముఖ పెట్టుబడి గమ్యస్థానంగా భారతదేశంను ఎంచుకుంటున్నట్లు అయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక వృద్ధిని పెంచడానికి చేపట్టిన వ్యూహాత్మక కార్యక్రమాలపై చర్చించారు.ఈ హై-ప్రొఫైల్ సింగపూర్ సంస్థల నిబద్ధత భారతదేశ ఆర్థిక వృద్ధికి గణనీయంగా దోహదపడుతుందని భావిస్తున్నారు. పెట్టుబడి రంగాలలో మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్ నుండి డేటా సెంటర్లు, విమానయానం వరకు అనేక రకాల రంగాల ప్రతినిధులతో ప్రధాని మోదీ చర్చలు జరిపారు.

# ఉక్రెయిన్‌తో యుద్ధం.. భారత్‌తో టచ్‌లో ఉన్నాం

**మాస్కో:** భారత్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధం విషయంలో.. భారత్ అభిప్రాయాలను గౌరవిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. భారత్‌తో పాటు మరో రెండు దేశాల మాటలను కూడా ఆలకిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉక్రెయిన్ అంశంలో భారత్‌తో నిరంతరం సంప్రదింపులు జరుగుతున్నట్లు పుతిన్ పేర్కొన్నారు. యుద్ధ సమస్యను పరిష్కరించేందుకు భారత్ చాలా నిష్టతో పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. రష్యా ఏజెన్సీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్ ఈ అభిప్రాయాలను వెల్లడించారు.
వాడివొస్టోక్‌లో జరిగిన ఈస్టర్న్ ఎకానమిక్ ఫోరమ్ సదస్సు అంశాలను పుతిన్ పేర్కొన్నారు. చర్చలతో సమస్యను పరిష్కరించాలన్న ఆలోచన ఉక్రెయిన్‌కు ఉంటే, దానికి తాము సిద్ధంగా ఉన్నట్లు పుతిన్ వెల్లడించారు. అయితే ఇటీవల కొన్ని వారాల క్రితం భారత ప్రధాని మోదీ.. ఉక్రెయిన్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. అక్కడ ఆయన అధ్యక్షుడు




జెలెన్‌స్కీతో కలిశారు. ఈ నేపథ్యంలో పుతిన్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.
స్నేహితులను, భాగస్వాములను గౌరవిస్తామని, ఉక్రెయిన్‌తో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు చైనా, బ్రెజిల్, ఇండియా ఇస్తున్న సలహాలను స్వీకరిస్తున్నామని, ఈ అంశంపై మిత్రదేశాలతో నిరంతరం టచ్‌లో ఉన్నట్లు పుతిన్ చెప్పారు. ఉక్రెయిన్‌తో చర్చలు నిర్వహించడంలో భారత్ కీలక పాత్ర పోషించనున్నట్లు రష్యా అధ్యక్ష భవన ప్రతినిధి దిమిత్రి పిస్కోవ్ తెలిపారు. ప్రధాని మోదీ, పుతిన్ మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని, పుతిన్‌తో పాటు జెలెన్‌స్కీ, అమెరికన్లతోనూ మోదీ మంచి పరిచయం ఉన్నదని, ప్రపంచ వ్యవహారాల్లో భారత్ తన అవకాశాన్ని వాడుకోవడానికి ఇది సందర్భం అవుతుందని, అమెరికా-ఉక్రెయిన్ దేశాలను శాంతి వైపుగా మళ్లించే సత్తా భారత్‌కు ఉన్నట్లు పిస్కోవ్ వెల్లడించారు. అయితే ఉక్రెయిన్, రష్యా వివాదంలో మధ్యవర్తిత్వం నిర్వహించేందుకు ప్రధాని మోదీ సిద్ధంగా ఉన్నారా లేదా అన్న విషయాన్ని మాత్రం పిస్కోవ్ స్పష్టం చేయలేదు. జెలెన్‌స్కీతో భేటీకి కొన్ని వారాల ముందే పుతిన్‌ను కూడా మోదీ కలిశారు. అయితే ఉక్రెయిన్ అంశంలో శాంతి స్థాపన కోసం మోదీ ప్రయత్నిస్తారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. తాము శాంతి వైపు ఉంటామని ఇటీవల పర్యటనలో మోదీ పేర్కొన్న విషయం తెలిసిందే.

## సీఎం అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

**న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం విధానంలో మనీ ల్యాండరింగ్ వ్యవహారంలో సీఎం అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌తోపాటు తన అరెస్ట్‌ను సవాల్ చేస్తూ.. దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. అందుకు సంబంధించిన



తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. ఢిల్లీ సీఎం కేజీవాల్ దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. అనంతరం ఈ కేసులో తీర్పును మంగళవారానికి సుప్రీంకోర్టు ధర్మాసనం రిజర్వ్ చేసింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బెయిల్‌తోపాటు తనను అరెస్ట్ చేయడంపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్లపై విచారించిన సుప్రీంకోర్టు.. తన తీర్పును సెప్టెంబర్ 10వ తేదీకి వాయిదా వేసింది. ఈ ఏడాది మర్చి 21వ తేదీన ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీ ల్యాండరింగ్ వ్యవహారంలో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. అనంతరం తీహార్ జైలుకు ఆయన్ని తరలించింది. జూన్ 26న ఆయన్ని సీబీఐ అరెస్ట్ చేసింది. ఆ క్రమంలో మనీ ల్యాండరింగ్ వ్యవహారంలో సుప్రీంకోర్టు సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కానీ అప్పటికే ఆయన్ని సీబీఐ అరెస్ట్ చేయడంతో.. కేజ్రీవాల్ తీహార్ జైల్లోనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.
ఇక ఈ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మాత్రమే జైల్లో ఉన్నారు. ఈ ఆగస్ట్‌లో ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొని అరెస్టయిన ముగ్గురు.. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె. కవిత, ఆప్ పార్టీ కమ్యూనికేషన్ మాజీ ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్‌లు బెయిలుపై విడుదలయ్యారు. ఇక ఇదే కేసులో గతంలో అరెస్టయిన ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ఈ ఏడాది ఏప్రిల్‌లో బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే.

## రామ్ రహీమ్‌కు ఆరుసార్లు పెరోల్ మంజూరు చేసిన మాజీ జైలు అధికారి.. బీజేపీ తొలి లిస్ట్‌లో అభ్యర్థి

**చండీగఢ్:** అత్యాచారం కేసులో దోషి, డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ ఇప్పటికే పది సార్లు పెరోల్‌పై జైలు నుంచి బయటకు వచ్చాడు. ఆయనకు ఆరు సార్లు పెరోల్ ఇచ్చిన మాజీ జైలు అధికారికి బీజేపీ టికెట్ ఇచ్చింది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిగా తొలి జాబితాలో పేర్కొంది.



దీంతో బీజేపీపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇద్దరు మహిళలపై అత్యాచారం కేసులో గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు 20 ఏళ్ల జైలు శిక్షను కోర్టు విధించింది. హర్యానాలోని రోహ్‌తక్ జిల్లాలోని సునారియా జైలులో ఆయన శిక్ష అనుభవిస్తున్నాడు. అయితే గుర్మీత్ రామ్ రహీమ్ నాలుగేళ్లలో పది సార్లు పెరోల్‌పై జైలు నుంచి బయటకు వచ్చాడు. లోక్‌సభ ఎన్నికల ముందు జనవరిలో 50 రోజులు పెరోల్‌పై విడుదలయ్యాడు. తాజాగా హర్యానా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆగస్ట్ నెలలో 21 రోజులు పెరోల్ పొందాడు. కాగా, గుర్మీత్ రామ్ రహీమ్‌కు ఆరు సార్లు పెరోల్ మంజూరు చేసిన జైలు అధికారి సునీల్ సంగ్వాన్ ఇటీవల ఆ పోస్ట్‌కు రాజీనామా చేశారు. అయితే 67 మంది అభ్యర్థులతో బీజేపీ విడుదల చేసిన తొలి జాబితాలో సునీల్ సంగ్వాన్ పేరును ఆ పార్టీ పేర్కొంది. దాద్రీ స్థానం అభ్యర్థిగా ప్రకటించింది. మరోవైపు 2019లో ఆ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన బీజేపీ మాజీ నేత సోమ్‌వీర్ సాంగ్వాన్ మళ్లీ అక్కడి నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. దీని కోసం కాంగ్రెస్ పార్టీలో ఆయన చేరనున్నట్లు తెలుస్తున్నది. అయితే గుర్మీత్‌కు చాలా సార్లు పెరోల్ మంజూరు చేయడం, ఆయనకు ఆరు సార్లు పెరోల్ ఇచ్చిన మాజీ జైలు అధికారికి బీజేపీ టికెట్ ఇవ్వడంపై కాంగ్రెస్ మండిపడింది.

## అదుపుతప్పి లోయలోపడిన వాహనం..

### నలుగురు ఆర్మీ సిబ్బంది మృతి



సిక్కింలో రోడ్డు ప్రమాదం సంభవించింది. వాహనం అదుపుతప్పి 700 అడుగుల లోతున్న లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో నలుగురు ఆర్మీ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మీ సిబ్బంది పశ్చిమ బెంగాల్‌లోని పెదాంగ్ నుంచి సిక్కింలోని పాక్యోంగ్ వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి సుమారు 700 నుంచి 800 అడుగుల లోతున్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో నలుగురు ఆర్మీ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మృతి చెందిన వారంతా పశ్చిమ బెంగాల్‌లోని బినాగురికి చెందిన ఎన్‌రోట్ మిషన్ కమాండ్ విభాగానికి చెందిన వారుగా భారత ఆర్మీ అధికారులు తెలిపారు.

# పదేండ్లలో 32 రెట్లు పెరిగిన సౌరశక్తి సామర్థ్యం

తొలి అంతర్జాతీయ సోలార్ ఫెస్టివల్ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచమంతా ఈరోజు సూర్యుడి ప్రభావాన్ని మననం చేసుకుంటూ మెరుగైన భూమండలం కోసం ప్రతిఒక్కరినీ ఈరోజు ప్రేరేపిస్తుందని ప్రధాని ఆకాంక్షించారు. గత పదేండ్లలో దేశం గ్రీన్ ఎనర్జీలో ఎంతో పురోగతి సాధించిందని గుర్తుచేశారు. పదేండ్లలో దేశ సౌరశక్తి సామర్థ్యం 32 రెట్లు పెరిగిందని చెప్పారు. ఈ వేగం, విస్తృతితో భారత్ 2030 నాటికి 500 గిగావాట్ల నాన్ ఫాసిల్ సామర్థ్యాన్ని సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వేదాల్లో నిక్షిప్తమైన మంత్రాల్లో అత్యంత ప్రముఖమైనవి సూర్యుడి గురించి ప్రస్తుతించినవి ఉన్నాయని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో సందేశంలో పేర్కొన్నారు. కోట్లాది మంది భారతీయులు ఈ మంత్రాన్ని పఠిస్తారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సంస్కృతులు సూర్యుడిని వారి వారి పద్ధతుల్లో గౌరవిస్తాయని చెప్పారు. పునరుత్పాదన ఇంధనలో ప్యారిస్ ఆశయాలను సాధించిన తొలి జీ20 దేశం భారత్



అని తెలిపారు. సౌర శక్తి రంగంలో తిరుగులేని వృద్ధితోనే ఇది సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. సౌరశక్తిని ప్రోత్సహించేందుకు తాము కొద్దినెలల కిందట ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తి బిల్ యోజనను ప్రారంభించామని తెలిపారు. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ. 75000 కోట్లు వెచ్చిస్తోందని చెప్పారు. ఈ పథకంలో భాగంగా కోటి మంది గృహస్థులు తమ ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెళ్లను అమర్చుకునేందుకు ఊతమిస్తామని తెలిపారు.

## వికీపీడియాను మందలించిన ఢిల్లీ హైకోర్టు.. కారణమిదే..




ప్రముఖ సమాచార సంస్థ వికీపీడియాకు షాక్ తగిలింది. వార్తా సంస్థ ఏఎన్ఐ వికీపీడియాపై పరువు నష్టం కేసు వేసిన విషయంలో కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత న్యాయవ్యవస్థ ఆదేశాలను పాటించకపోతే, భారతదేశంలో తమ వ్యాపారాన్ని మూసివేయమని ప్రభుత్వాన్ని ఆదేశిస్తామని స్పష్టం చేసింది. మీకు భారతదేశం నచ్చకపోతే ఇక్కడ మీ కార్యాకలాపాలు మూసివేయాలని కోర్టు తెలిపింది. అయితే కోర్టు ఎందుకు ఈ వ్యాఖ్యలు చేసింది, ఏం జరిగిందనే విషయాన్ని ఇప్పుడు తెలుసుకుందాం.
ప్రచారం సాధనం?
వికీపీడియా తన పేజీలో ANIని ప్రస్తుత ప్రభుత్వానికి 'ప్రచార సాధనం'గా పేర్కొన్న సమాచారాన్ని రాసిందని వార్తా సంస్థ తెలిపింది. ఈ క్రమంలో వార్తా సంస్థ ఏఎన్ఐ వికీపీడియాపై ఢిల్లీ కోర్టులో రూ.2 కోట్ల పరువునష్టం దావా వేసింది. వికీపీడియా తన ప్లాట్‌ఫారమ్‌లో సవరణలు చేసుకోవడానికి వ్యక్తులను అనుమతిస్తోందని ANI ఆరోపించింది. ANI పేజీలో వార్తా సంస్థకు బదులుగా ప్రభుత్వ ప్రచార సాధనంగా ఉందని వికీపీడియా ఆరోపణలు చేసింది. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన ఢిల్లీ హైకోర్టు గురువారం (సెప్టెంబర్ 5, 2024) వికీపీడియాకు ధిక్కార నోటీసు జారీ చేసింది. ఈ క్రమంలో న్యాయస్థానం ఆ సంస్థను హెచ్చరించింది. వికీపీడియా తన ప్లాట్‌ఫారమ్‌లోని వార్తా సంస్థ పేజీలలో అవమానకరమైన విషయాలను ప్రచురిస్తోందని %ూాచీ×% ఆరోపించింది. ఈ విషయాన్ని ఆపివేయాలని, తొలగించాలని కోర్టును డిమాండ్ చేసింది. స్పందించిన కోర్టు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి నవీన్ చావ్లా ఈ కేసులో వికీపీడియా న్యాయవాది వాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఎందుకంటే ఈ సంస్థ భారతదేశంలో స్థావరం కానందున కోర్టుకు హాజరు కావడానికి ఆయనకు సమయం పట్టింది. మౌఖిక వ్యాఖ్యలు చేస్తూ ఇకపై ఈ అంశాన్ని సహించేది లేదని కోర్టు తెలిపింది. అవసరమైతే దేశంలోనే మీ కార్యకలాపాలు మూసివేయాలని ప్రభుత్వాన్ని కోరతామని కోర్టు తెలిపింది. తదుపరి విచారణ సమయంలో కోర్టుకు హాజరు కావాలని వికీపీడియా అధీకృత ప్రతినిధిని కోర్టు కోరింది. ఈ క్రమంలో కేసు తదుపరి విచారణను అక్టోబర్ 25, 2024కు కోర్టు వాయిదా వేసింది. అంతకుముందు సమన్లు జారీ చేసిన తర్వాత వికీపీడియా ప్రతినిధి ఆగస్టు 20, 2024న కోర్టుకు హాజరయ్యారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన పంజాబ్

### విద్యుత్తుపై సబ్సిడీ ఎత్తివేత

చండీఘఢ్: ఉచితాలతో దివాళా తీసిన పంజాబ్ సర్కార్ ఇప్పుడు ఆదాయం పెంచే పనిలో పడింది. పంజాబ్ మంత్రి మండలి ఇవాళ రెండు కీలక నిర్ణయాలను తీసుకున్నది. పెట్రోల్, డీజిల్‌పై ధరలను పెంచింది. ఇక ఇంటి విద్యుత్తుపై ఉన్న సబ్సిడీని తాత్కాలికంగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. సీఎం భగవంత్‌మాన్ నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ భేటీలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. పెట్రోల్ పై 61 పైసలు, డీజిల్‌పై 92 పైసల్ పెంచారు. దీని వల్ల రాష్ట్రానికి అదనంగా 1500 నుంచి 1700 కోట్ల ఆదాయం వచ్చే అవకా శాలు ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. తీవ్ర ఆర్థిక వత్తిడి లో ఉన్న పంజాబ్ సర్కార్.. ఆగస్టు నెలకు చెందిన జీతాలు, పెన్షన్‌ను రిలీజ్ చేయడంలో జాప్యం చేస్తున్నది. 7 కిలోవాట్ల వరకు విద్యుత్తును వినియోగించే ఇండ్లకు యూనిట్‌పై ఇచ్చే రూ.2.50 సబ్సిడీని ఎత్తివేస్తున్నట్లు పంజాబ్ సర్కారు తెలిపింది. ఈ స్కీమ్‌ను గత కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. అయితే డొమెస్టిక్ వినియోగదారులకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు ఆర్థిక మంత్రి హర్పాల్ చీమా తెలిపారు. కొందరికి రెండు సబ్సిడీలు అందుతున్నాయని, వాటిని తగ్గించడం వల్ల రాష్ట్రానికి 392 కోట్లు ఆదా అవుతాయని తెలిపారు.

## లంచం ఇవ్వాలనుకున్నారు.. పోలీసులపై అభయ తల్లిదండ్రుల సంచలన ఆరోపణలు

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో గత నెలలో దారుణ హత్యాచారానికి గురైన జూనియర్ వైద్యురాలు అభ య తల్లిదండ్రులు పోలీసులపై సంచలన ఆరోపణలు చేశారు. తమ కుమార్తె మృతదేహాన్ని హడావిడిగా దహనం చేయాలని పోలీసులు అనుకున్నారని.. ఇందుకోసం



తమకు లంచం ఇవ్వజూపారని వారు ఆరోపించారు. తద్వారా కేసును అణచి వేసేందుకు ప్రయత్నించారని అన్నారు. ఈ ఘటనకు నిరసన గా కోల్‌కతాలో రాత్రి జరిగిన ఆందోళనల్లో బాధితురాలి తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం అభయ తండ్రి మాట్లాడుతూ.. "హత్యాచార కేసులో ప్రజలకు నిజాలు తెలియనివ్వకుండా పోలీసులు ప్రయత్నించారు. మృతదేహాన్ని చూసేందుకు కూడా మాకు అనుమతించలేదు. పోస్టుమార్టం అయ్యేంత వరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లోనే మమ్మల్ని ఉంచారు. మృతదేహాన్ని మాకు అప్పగిస్తున్న తరుణంలో ఓ సీనియర్ పోలీస్ అధికారి మాకు లంచం ఇవ్వజూపారు. దాన్ని మేం తిరస్కరించాం. ఇలా మొదటి నుంచి కేసు అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారు" అని అన్నారు.

**పోలీసుల నుంచి సీబీఐకి బదిలీ..**

హత్యాచార ఘటనపై తొలుత రాష్ట్ర పోలీసుల బృందం విచారణ చేపట్టింది. అప్పటికే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు మిన్నంటడం, పోలీసుల దర్యాప్తుపై అనుమానాలు రావడంతో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సీబీఐకి కేసును అప్పగిస్తూ కోల్‌కతా హైకోర్టు తీర్పు వెలువరించింది. ప్రస్తుతం ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు స్పీడప్ చేసింది. నిందితుడు సంజయ్ రాయ్‌కి ఇప్పటికే వివిధ పరీక్షలు నిర్వహించారు. అతనితోపాటు ఆర్‌జీ కర్ మెడికల్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌కి కూడా పాలీగ్రాఫ్ పరీక్ష జరిపారు.

**సుప్రీంను ఆశ్రయించిన సందీప్..**

కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ (%ఝఅఎఅజూ +ష్ట్రశీంష్ట్ర%)ను సీబీఐ (%జదీ×%) సోమవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వైద్య కళాశాల, ఆసుపత్రిలో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే అభియోగంపై ఆయనను సీబీఐ అరెస్టు చేసింది. ఘోష్ తన హయాంలో అవకవతవకలకు పాల్పడ్డారంటూ సీబీఐ ఇటీవల ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కోల్‌కతా హైకోర్టు ఆదేశాల మేరకు ఘోష్‌తో మూడు ప్రైవేటు సంస్థలపై కూడా సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అవినీతి కేసుకు సంబంధించి ఘోష్ నివాసంపై ఆగస్టు 25న సీబీఐ దాడులు జరిపి రోజంతా సోదాలు చేపట్టింది. ఆసుపత్రి సెమినార్ హాలులో ఆగస్టు 9న అత్యాచారం, హత్యకు గురైన ట్రయినీ డాక్టర్ కేసును సైతం సీబీఐ దర్యాప్తు చేస్తోంది. కాగా, ఘోష్ తన హయాంలో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై మనీలాండరింగ్ కేసు కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా విచారణ జరుపుతోంది. ఘోష్‌పై ఆరోపణల నేపథ్యంలో ఆయన సభ్యత్వాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇటీవల రద్దు చేసింది. అయితే ఈ కేసులో తననూ కక్షిదారుగా చేర్చాలన్న తన అభ్యర్థనను హైకోర్టు కొట్టేయడాన్ని సందీప్ ఘోష్ సుప్రీంలో సవాల్ చేశాడు. ఈ పిటిషన్‌పై త్వరలో విచారణ జరగనుంది. కాగా.. బుధవారం ఘోష్‌ను కోర్టు ముందు హాజరుపరచడానికి తీసుకెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై దాడికి యత్నించారు.

# ఏఐ అంతర్జాతీయ కేంద్రంగా హైదరాబాద్

-మొదటిపేజీ తరువాయి

చేపట్టే చర్యలను పేర్కొన్నారు. హైదరాబాద్ లో జీపీయూ ఆధారిత ఏఐ క్లౌడ్ ఏర్పాటులో భాగస్వామ్యంలో సదస్సులో చర్చించారు. కొత్త ఆవిష్కరణలు ఆశలతో పాటు భయాన్ని తీసుకొస్తాయని.. విప్లవాత్మక మార్పులకు హైదరాబాద్ మాదిరిగా ఏ నగరమూ సిద్ధంగా లేదని అన్నారు. ఏఐ ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేశామని.. నాస్కామ్ సహకారంతో ఏఐ ఫ్రేమ్ వర్క్‌కు రూపకల్పన జరుగుతుందని చెప్పారు. ఆవిష్కరణలకు పారిశ్రామిక నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తోందని పేర్కొన్నారు. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దామని అన్నారు.'సాంకేతికత, ఆవిష్కరణ లేకుండా సమాజంలో ఏ మార్పు జరగదు. మొదటి రైలు, ఇంజిన్ ఆవిష్కరణ తరువాత ప్రపంచం పూర్తిగా మారింది. విమానం ఆవిష్కరణతో ప్రపంచ స్వరూపమే మారిపోయింది. ఇదే క్రమంలో కరెంటు, బల్బు, టీవీ, కెమెరా, కంప్యూటర్.. ఇలా ఇవన్నీ ప్రపంచ గతిని మార్చడంలో కీలక పాత్ర పోషించాయి. ఆధునిక సాంకేతికతతో ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ వాడడం మన తరం చేసుకున్న అదృష్టం. ఇవాళ ప్రపంచ సాంకేతిక రంగంలో వచ్చిన అత్యుత్తమ ఆవిష్కరణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. కొత్త టెక్నాలజీ వచ్చినప్పుడల్లా కొంత భయం నెలకొంటుంది. అది మన జీవితాన్ని ఎలా మెరుగుపరుస్తుంది.. అదే సమయంలో ఉద్యోగాలు పోతాయా భయం ఉండటం సహజం. దేశ చరిత్రను పరిశీలిస్తే.. గతంలో వచ్చిన పారిశ్రామిక విప్లవాన్ని సరిగ్గా అనుసరించలేకపోయాం. భారతదేశ భవిష్యత్తు గురించి ఆలోచిస్తే.. హైదరాబాద్ సిటీలా మరే సిటీ




పరిశ్రమల ఏర్పాటుకు సంపూర్ణంగా సిద్ధంగా లేదు. ఇందుకు సంబంధించిన సవాళ్లను స్వీకరించడమే కాదు. భవిష్యత్తును సృష్టిస్తాం. హైదరాబాద్‌ను ఏఐ హబ్‌గా తీర్చిదిద్దబోతున్నామ నేందుకు ఈ సదస్సు నిదర్శనం. సిటీ ఆఫ్ ది ఫ్యూచర్‌కి మీ అందరికి స్వాగతం.' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.ఏఐలో పట్టు సాధించబోతున్నామని.. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. డీప్ ఫేక్ లాంటి ఘటనలు జరగకుండా ఏఐని సరైన దారిలో ఉపయోగించుకుంటామని.. ప్రపంచ స్థాయి యూనివర్శిటీలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నామని పేర్కొన్నారు. ఎథికల్ ఏఐ విషయంలో జపాన్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తున్నామని అన్నారు. రాబోయే 2 రోజులు హెచ్ఐసీసీ వేదికగా ఏఐపైనా చర్చలు,స సెమినార్లు ఉంటాయని అన్నారు. విప్లవాత్మక మార్పులకు హైదరాబాద్ తప్పించి, మరే నగరం కూడా సిద్ధంగా లేదన్నారు. ఏఐ ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాదులు వేశామన్నారు. నాస్కాం సహకారంతో ఏఐ ఫ్రేమ్ వర్క్‌కు రూపకల్పన జరుగుతున్నట్లు తెలిపారు. ఆవిష్కరణలకు సంబంధించి నిపుణులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరించుదామన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థలకు ఇక ఉచిత విద్యుత్

-మొదటిపేజీ తరువాయి

వర్షాలు, వరదల కారణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయారని తెలిపారు.
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం గురువారం కీలక నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలోని విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్‌ని సరఫరా చేయనున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్‌పై విద్యుత్‌శాఖ జీవో జారీ చేసింది. మొత్తం 27,862 విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఉచిత విద్యుత్‌పై ప్రకటన చేశారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రస్తుతం కంపెనీలకు అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థ లేదని.. రాష్ట్ర విద్యా వ్యవస్థ




మారాల్సి ఉందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని.. అంతర్జాతీయంగా పోటీపడేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నా మన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసిన సమయంలో చక్కగా సహకరించారని.. ఉపాధ్యాయులు ఎంత గొప్ప వారైతే సమాజం అంత గొప్పగా మారుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. మన విద్యావ్యవస్థ ప్రస్తుత కంపెనీల అవసరాలకు అనుగుణంగా లేదన్నారు. మన విద్యావ్యవస్థ ఇంకా మారాల్సి ఉందని పేర్కొన్నారు. అందుకే స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించుకున్నామన్నారు. రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నట్లు తెలిపారు. మన విద్యార్థులు అంతర్జాతీయంగా పోటీపడేలా తీర్చిదిద్దాలని భావిస్తున్నామన్నారు. అదృష్టం కొద్దీ మన రాష్ట్రంలో ఆదర్శమైన గురువులు ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలను వారు చాలా చక్కగా అమలు చేస్తున్నారని కితాబునిచ్చారు. ఇంగ్లీష్ మీడియంను పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసినప్పుడు ఎంతో సహకరించారని గుర్తు చేసుకున్నారు. గురువులు ఎంత గొప్పవాళ్లైతే సమాజం కూడా అంతే గొప్పగా మారుతుందన్నారు.

# కేసీఆర్ మౌనమే వ్యూహమా

-మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు ప్రతిపక్ష నేత ఫామ్ హౌస్ కు పరిమితం అయితే.. ఆయన కుమారుడు అమెరికాలో జల్సా చేస్తున్నారని.. అక్కడ్నుంచి సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ను రేవంత్ టార్గెట్ చేయడం ఇదే మొదటి సారి కాదు. అసెంబ్లీ సమావేశాలకు రాకపోవడం దగ్గర్నుంచి కేసీఆర్ ఎందుకు బయటకు రారని పదే పదే ప్రశ్నిస్తూ వస్తున్నారు. కానీ బీఆర్ఎస్ వద్ద సరైన సమాధానమే లేకుండా పోయింది. అయితే రైతు రుణమాఫీ ఇతర అంశాలపై కాంగ్రెస్ తీరును ఎండగట్టేందుకు కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లేందుకు రెడీ అయ్యారని.. రూట్ మ్యాప్ పై కసరత్తు కూడా చేశారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. వాతావరణం సాధారణంగా ఉంటే ఈ పాటికి ఆయన బస్సు తెలంగాణ రోడ్లపై పరుగులు పెడుతూ ఉండేదని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చీల్చి చెండాడేవారని అంటున్నారు. వర్షం తగ్గిన తర్వాత మంచి రోజు చూసుకుని కేసీఆర్ ప్రజల్లోకి వెళ్తారని చెబుతున్నారు. అయితే ప్రజల్లోకి వెళ్లడానికి ఇంత కన్నా మంచి సందర్భం ఏమి ఉంటుందని.. ప్రభుత్వ వైఫల్యంపై విరుచుకుపడితే పార్టీకే మేలు కదా అని బీఆర్ఎస్ నేతల్లోనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. కేసీఆర్ రాజకీయ వ్యూహాల్లో మౌనానిది కీలక పాత్ర. ఆయన కీలకమైన విషయాల్లో మౌనంగా ఉంటారు. సరైన సమయం చూసి ఎంటర్ అవుతారు. సిక్సర్ కొడతారు. అప్పటి వరకూ ఆయన చుట్టు ముసురుకున్న వ్యతిరేకత అంతా పాజిటివ్ గా మారుతుంది. రేవంత్ ప్రభుత్వానికి సమయం ఇచ్చేందుకే ఆయన సైలెంట్ గా ఉన్నారని.. ఇవాళ కాకపోతే రేపు.. రేపు కాకపోతే ఎల్లుండి ఆయన ప్రజల్లోకి వస్తారని .. కాంగ్రెస్‌కు చుక్కలు చూపిస్తారని బీఆర్ఎస్ వర్గాలు నమ్ముతున్నాయి. అయితే మంచి అవకాశాల్ని కోల్పోతున్నామన్న భావన మాత్రం కొంత మంది బీఆర్ఎస్ నేతల్లో కనిపిస్తోంది. కేసీఆర్ మళ్లీ యాక్టివ్ అయితే పార్టీ పుంజుకునే అవకాశం ఉందని, అదే సమయంలో అనుకున్న సంఖ్యలో వలసలు లేకపోతే అనర్హత వేటు పడే ప్రమాదాన్ని ఎదుర్కొవాల్సి వస్తుందని కొందరు ఎమ్మెల్యేలు భయపడుతున్నట్లు చెబుతున్నారు. కేసీఆర్ కూడా తనను కలిసిన ఎమ్మెల్యేలతో వలస వెళ్లిన వారిపై అనర్హత వేటు వేయించడంతోపాటు కాంగ్రెస్ హామీలపై ఆరా తీస్తున్నట్లు చెబుతున్నారు. జంపింగ్ ఎమ్మెల్యేలపై వేటు వేయడమే టార్గెట్‌గా పెట్టుకున్న బీఆర్ఎస్?. పార్టీ అధినేత రంగంలోకి దిగిన తర్వాత అనర్హత వేటు ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా పావులు కదుపుతోందంటున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఎక్కువగా ఫాం హౌస్‌లో ఉంటున్న మాజీ సీఎం కేసీఆర్? తనను కలిసేందుకు వచ్చిన కార్యకర్తలు, నాయకులకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేకత పెరుగుతోందని తాజాగా అంచనాకు వచ్చిన కేసీఆర్? స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి పునర్ వైభవం తెచ్చేందుకు ఇప్పటి నుంచే తగిన కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం రైతు రుణమాఫీపై అసంతృప్తి ఎక్కువగా ఉన్నట్లు బీఆర్ఎస్ అంచనా వేస్తోంది.రకరకాల నిబంధనలు విధించడం వల్ల.. 30 వేల కోట్లకుపైగా అవుతుందని అంచనా వేసిన రైతు రుణమాఫీ కేవలం 17 వేల కోట్లతో సరిపెట్టిందని ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఆరోపణలు గుప్పిస్తోంది. ఈ విషయమై కృష్ణార్జునులు హరీశ్ రావు, కేటీఆర్ ఇప్పటికే ఫైట్ చేస్తున్నారు. ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేసి, ప్రభుత్వాన్ని ఒత్తిడికి గురిచేయాలని భావిస్తోంది బీఆర్ఎస్. ఇందుకోసం నేరుగా అధినేత రంగంలోకి దిగితే స్థానిక ఎన్నికల్లో అడ్వాంటేజ్ అయ్యే అవకాశం ఉందని ఊహిస్తోంది. కేసీఆర్ కూడా తగిన సమయం వరకు వేచి చూద్దామని ఇన్నాళ్లు ఆగారని.. ఇప్పుడు సమయం ఆసన్నమైనందున సమర శంఖం పూరించాలని డిసైడ్ అయినట్లు చెబుతున్నారు. వినాయక చవితి తర్వాత ఎప్పుడైనా, రైతు యాత్రలు ప్రారంభించేలా ప్లాన్ చేయాలని పార్టీ యంత్రాంగాన్ని ఆదేశించినట్లు చెబుతున్నారు.

# తాడ్వాయి ఫారెస్ట్ విచారణ షురూ

**వరంగల్ :** ములుగు జిల్లా తాడ్వాయి, పస్రా ఫారెస్ట్ రేంజ్ లో ఏకంగా 200 హెక్టార్లలో చెట్లు నేల మట్టం కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గతంలో ఎంతటి భారీ వర్షాలు కురిసినా అటవీ ప్రాంతాలు ప్రభావితమైన దాఖలాలు చాలా తక్కువే. కానీ ఇప్పుడు కురిసిన వర్షాలకు చిన్న, పెద్ద వృక్షాలు అన్ని కలిపి 50 వేలకు పైగా చెట్లు నేలమట్టం కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ఫారెస్ట్ ఏరియా భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.రాష్ట్రంలో వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 31వ తేదీ శనివారం రాత్రి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు నమోదయ్యాయి. కాగా ములుగు జిల్లాలో కూడా వర్ష ప్రభావం ఉండగా.. అది ఫారెస్ట్ ఏరియాపై ఎక్కువ కనిపించింది. ఏకంగా 200 హెక్టార్లలో 50 వేలకు పైగా చెట్లు నేలమట్టం అయ్యాయంటే మామూలు విషయం కాదు. అటవీ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో అసలు ఫారెస్ట్ ఏరియాలో ఇంత పెద్ద ఎత్తున చెట్లు కూలిపోవడంపై విచారణకు ఆదేశించారు.ఈ మేరకు వరంగల్ సీసీఎఫ్ ప్రభాకర్, ములుగు జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ రాహుల్ కిషన్ జాదవ్, ఇతర అధికారులు విచారణ చేపట్టారు. మంగళవారం సాయంత్రం ఒక దఫా ఎంక్వైరీ చేసి, అక్కడి పరిస్థితిని పరిశీలించారు. చెట్లు నేలకూలిన ప్రదేశాన్నంతా కలియ తిరిగారు. ఒక్క గాలివానకే ఇంత పెద్ద నష్టం జరగడం ఇదే తొలిసారి అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మంగళవారం అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టగా.. బుధవారం టెక్నికల్ టీమ్ అధికారులు కూడా అటవీ ప్రాంతాన్ని సందర్శించి నివేదిక తయారు చేయనున్నట్లు తెలిసింది.అటవీ ప్రాంతం నేలమట్టం కావడంపై ఫారెస్ట్ అధికారులు శాస్త్రీయ కారణాలను అన్వేషించే పనిలో పడ్డారు. ఈ మేరకు చెట్లు కూలిపోయిన ప్రదేశంలో మట్టి శాంపిల్స్ సేకరించారు. దాదాపు మూడు మీటర్ల లోతులో నుంచి మట్టి శాంపిల్స్ తీసుకుని, వాటిని ల్యాబ్‌కు పంపి పరీక్షించే పనిలో పడ్డారు. చెట్లు నేల కూలడానికి అసలు కారణాలు ఏంటి.. అక్కడి నేల స్వభావం ఏమైనా మారిందా.. లేదా ఇందులో కుట్ర ఏమైనా దాగి ఉందా.. అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు. రెండు రోజుల కిందటే మట్టి శాంపిల్స్ కు పంపించగా.. అక్కడి నుంచి వచ్చే రిపోర్ట్ ఆధారంగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ఒక వేళ నేల స్వభావం మారితే ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై కసరత్తు చేస్తున్నారు. భవిష్యత్తులో మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అటవీ ప్రాంత రక్షణ కోసం తగిన చర్యలు చేపట్టనున్నట్లు అటవీ శాఖ సిబ్బంది వివరించారు.వనదేవతలు సమ్మక్క–సారక్కల దయవల్లనే ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదని మంత్రి సీతక్క అన్నారు. ఈ గాలి విధ్వంసం గ్రామాల్లో జరిగి ఉంటే భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగి ఉండేదని అన్నారు.

## మరమ్మతులు, పునరుద్ధరణకు టెండర్లను పిలవండి..

-మొదటిపేజీ తరువాయి

లేదా అన్న పరిశీలన కనిపించలేదన్నారు. తద్వారా విపత్తులు సంభవించినప్పుడు దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఒక దగ్గర రెగ్యులేటరీ జామ్ అయ్యిందన్నారు. మరోచోట షట్లర్ ఎత్తుతుంటే తెగిపోయిందన్నారు. ఈ తరహా సంఘటనలు మరోసారి పునరావృతం అయితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటే అందుకు సీఈలే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖా ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీలు అనిల్ కుమార్, నాగేందర్ రావు, హరేరాం, శంకర్.. నీటిపారుదల శాఖా సలహాదారుడు అదిత్యా దాస్ నాథ్, డిప్యూటీ ఈఎన్‌సీ కే.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల శాఖా చీఫ్ ఇంజినీర్లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## ప్రజాపాలన అంటే ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కడమేనా?

### కొణతం దిలీప్ అరెస్ట్‌ను ఖండించిన కేటీఆర్



**హైదరాబాద్ :** తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ అక్రమ అరెస్ట్‌ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజా పాలన అంటే ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కడమేనా..? అని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్, తెలంగాణవాది కొణతం దిలీప్‌ను పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారు. కొంతకాలంగా ప్రభుత్వ అసమర్థ చేతగాని తనాన్ని దిలీప్ ప్రశ్నించటాన్ని రేవంత్ సర్కార్ తట్టుకోలేకపోతోంది. కొన్ని రోజుల క్రితం కూడా తప్పుడు కేసులో ఇబ్బంది పెట్టాలని ప్రయత్నిస్తే హైకోర్టు చీవాట్లు పెట్టిన బుద్ధి రాలేదు. ఎలాగైనా దిలీప్ గొంతునొక్కాలన్న ఉద్దేశంతో మరోసారి అక్రమంగా అదుపులోకి తీసుకున్నారు. కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఏ కేసులో అదుపులోకి తీసుకుంటున్నారో కూడా చెప్పకుండా అరెస్ట్ చేశారని కేటీఆర్ పేర్కొన్నారు. అక్రమ అరెస్ట్‌లు, నిర్బంధాలతో పాలన కొనసాగించవచ్చునుకుంటే అది మీ భ్రమే. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అక్రమ నిర్బందాలు చేసిన ప్రభుత్వాన్ని ప్రశ్నించే వాళ్లు మరింత మంది పుట్టుకొస్తారు. అక్రమంగా అదుపులోకి తీసుకున్న దిలీప్‌ను తక్షణమే విడుదల చేయాలి. 9 నెలలుగా తెలంగాణలో వాక్ స్వాతంత్రం లేదు. నిరంకుశ పాలన సాగుతోందని కేటీఆర్ ధ్వజమెత్తారు.

## విద్యా వ్యవస్థ ఇంకా బలోపేతం కావాలి



**సిద్దిపేట జిల్లా:** విద్యావ్యవస్థ ఇంకా బలోపేతం కావాలని మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్?రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీసీ భవనంలో గురుపూజోత్సవం సందర్భంగా ఈరోజు(గురువారం) జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో హరీష్?రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్?రావు మాట్లాడుతూ... సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా గురు పుజోత్సవం జరుపుకుంటారని తెలిపారు. ఈ గురువులు అందరికీ గురు పుజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులకు సమాజంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని వివరించారు. ఎవరికి దొరకని గౌరవం ఓక ఉపాధ్యాయునికి దొరుకుతుందని అన్నారు. సిద్దిపేట జిల్లా ఉపాధ్యాయులు ఎప్పుడు సిద్దిపేట గౌరవాన్ని కాపాడారని చెప్పారు. రాష్ట్రంలో పదోతరగతి ఫలితాల్లో సిద్దిపేటను రెండో స్థానంలో ఉపాధ్యాయులు నిలిపారని ప్రశంసించారు. రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా త్రిబుల్ ఐటీలో మొదటిస్థానంలో ఉందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ తెలంగాణలోని పాఠశాల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టారని చెప్పారు. 'మన ఊరు – మన బడి' పథకంలో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా ప్రారంభించామని తెలిపారు. 'మన ఊరు – మన బడి' పనులను కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యలోనే ఆపేసిందని ఆరోపణలు చేశారు.రాష్ట్రంలో 1700 ప్రభుత్వ పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధ్యాయులకు సంబంధించిన నాలుగు డీఏలు ఇంకా పెండింగ్?లో ఉన్నామని..వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో ఉచిత కరెంటు లేదని.. స్కవెంజరు?లు లేరని చెప్పారు.? విద్యా వలంటీర్లు, ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని తీసివేతలు, ఏరివేతలు కోతలు పెడుతున్నారని ఆరోపణలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో విద్యా నిలయంగా సిద్దిపేటను మార్చుకున్నామని చెప్పారు. ?సిద్దిపేట ప్రజలు అన్ని చదువులు చదవాలని అన్ని కోర్సులు అందుబాటులోకి తెచ్చినట్లు హరీష్?రావు వెల్లడించారు.

## భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి నీటి ప్రవాహం

-మొదటిపేజీ తరువాయి



అమల్లోకి వచ్చినట్లు జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో భద్రాచలంలో గోదావరి కరకట్టపైకి యాత్రికుల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. ఇలాగే వరద ప్రవాహం పెరుగుతుంటే ఈ సాయంత్రానికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. మరో పక్క బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈరోజు వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో, తెలుగు రాష్ట్రాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గోదావరి వరద ప్రవాహం మరింత పెరిగచ్చని అంటున్నారు. తాజాగా కురిసిన వర్షాల కారణంగా ఇప్పటికే ఖమ్మం జిల్లాలో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాగా, ఈ ఏడాది జులై 27న భద్రాచలం వద్ద 53.9 అడుగుల మేర వరద రావడంతో అప్పట్లో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆ సమయంలో గోదారి తీర ప్రాంతం అతలాకుతలం అయింది. ఇప్పుడిప్పుడే తేరుకుంటుండగా, మరోసారి నదిలో నీటి మట్టం పెరుగుతుండడంతో పరిసర ప్రాంత ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి వరద పెరుగుతోంది. దవళేశ్వరం కాటర్ బ్యారెజ్ వద్ద నుండి 8లక్షల 37వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదలవుతోంది.

**ఎస్సారెస్పీకి భారీ వరద.. 41 వరద గేట్ల ద్వారా నీటి విడుదల**

**హైదరాబాద్ :** శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్‌కు భారీ వరద కొనసాగుతున్నది. ఎగువ మహారాష్ట్ర, గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు ఎస్సారెస్పీకి భారీగా వరద వస్తోంది. ప్రస్తుతం 2 లక్షల 25 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండడంతో 3లక్ష 24వేల క్యూసెక్కుల ఔట్ ఫ్లోను 41 వరద గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు. ఎస్సారెస్పీలో గరిష్ఠ నీటిమట్టం 1,091 అడుగులు కాగా 1,089 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం 73.458 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కాగా, భారీ వర్షాల నేపపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దని అధికారులు హెచ్చరించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ అవసరం వచ్చినా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

# నిండు కుండలా తెలంగాణ ప్రాజెక్టులు

**ఆగస్టు రెండో వారం నాటికే నిండిన కృష్ణా బేసిన్**
**గోదావరి బేసిన్కు పోటెత్తుతున్న వరద**
**శ్రీరాంసాగర్కు 3.05 లక్షల క్యూసెక్కులు..ఎల్లంపల్లికి 3.39 లక్షల క్యూసెక్కుల ఇన్ఫ్లో**
**ఫుల్ కెపాసిటీకి చేరుకున్న నిజాంసాగర్, సింగూరు**
**పైనుంచి వరద.. దిగువకు నీటి విడుదల**




**హైదరాబాద్, శుభ తెలంగాణ :** రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ నిండు కుండలా మారాయి. మధ్యతరహా ప్రాజెక్టుల నుంచి భారీ ప్రాజెక్టుల వరకు అన్నింట్లో జలకళ సంతరించుకుంది. కృష్ణా బేసిన్లోని ప్రాజెక్టులు గత నెలలోనే నిండగా.. ఇప్పుడు గోదావరి బేసిన్లోని శ్రీరాంసాగర్ సహా ప్రధాన ప్రాజెక్టులు వరద పోటుతో ఫుల్ అయ్యాయి. ప్రస్తుతం కృష్ణా బేసిన్లో వరద తగ్గుముఖం పట్టినా.. గోదావరి బేసిన్లో మాత్రం వరద తీవ్రత ఎక్కువగానే ఉంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. కృష్ణా నదికి వరద ప్రవాహం తగ్గడంతో నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టు గేట్లను క్లోజ్ చేశారు.

**పోయిన నెలలోనే నిండిన కృష్ణా బేసిన్**

ఆగస్టు రెండోవారం నాటికే కృష్ణా బేసిన్లోని ప్రాజెక్టులు నిండాయి. ఎగువన కురిసిన వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కింది. దీంతో ప్రాజెక్టులు అనుకున్న దానికన్నా వేగంగా ఫుల్ కెపాసిటీకి చేరాయి. ఆగస్టు ఫస్ట్ వీక్లోనే శ్రీశైలం ప్రాజెక్టు నిండగా.. రెండో వారంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఫుల్ కెపాసిటీకి చేరుకుంది. ప్రస్తుతం ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల గేట్లను మూసేశారు. జూరాల ప్రాజెక్టుకు భీమా నదిపై కట్టిన సన్నతి బ్యారేజీ (కర్ణాటక) నుంచి మొన్నటిదాకా వచ్చిన వరద కూడా తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం జూరాలకు 1.28 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 1.37 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 1.54 లక్షల క్యూసెక్కుల ఫ్లడ్ నమోదవుతున్నది. దిగువకు 90,244 క్యూసెక్కులను రిలీజ్ చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 39 వేల స్వల్ప ప్రవాహాలు రికార్డవుతున్నాయి. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు ఫుల్ కెపాసిటీ 9.66 టీఎంసీలకు గానూ 8.81 టీఎంసీల నిల్వ ఉన్నది. శ్రీశైలం ప్రాజెక్టు 215.81 టీఎంసీల కెపాసిటీకి గానూ 209.59 టీఎంసీలతో నిండుకుండలా ఉన్నది. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 312.05 టీఎంసీలకుగానూ 304.47 టీఎంసీల నీళ్లున్నాయి.

**కళకళలాడుతున్న గోదావరి**

గోదావరి బేసిన్లోని ప్రాజెక్టులు కూడా ప్రస్తుతం జలకళ సంతరించుకున్నాయి. ఇటీవలి భారీ వర్షాలతో ఈ ప్రాజెక్టులకు భారీ వరద కొనసాగుతున్నది. ఎగువన వర్షాలుండడంతో గోదావరికి వరద పోటెత్తుతున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 3.05 లక్షల క్యూసెక్కుల ఫ్లడ్ వస్తుండగా.. 3.58 లక్షల క్యూసెక్కులను కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 80.50 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 75.31 టీఎంసీల నిల్వ ఉన్నది. వారం కిందటి వరకు నీళ్లు లేక ఎండిపోయిన సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులూ ప్రస్తుతం జలకళను సంతరించుకున్నాయి. ఆ ప్రాజెక్టులు కూడా పూర్తిస్థాయి సామర్థ్యానికి చేరువలో ఉన్నాయి. సింగూరుకు 44 వేలు, నిజాంసాగర్కు 28 వేల క్యూసెక్కుల చొప్పున వరద వస్తున్నది. కడెం ప్రాజెక్టుకు 8,815 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నది. కడెం ప్రాజెక్టులో ప్రస్తుతం 7.6 టీఎంసీలకుగానూ 6.52 టీఎంసీల నిల్వ ఉన్నది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 3.39 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నది. దీంతో ఆ ప్రాజెక్టు నుంచి 2.40 లక్షల క్యూసెక్కుల నీటిని రిలీజ్ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 20.175 టీఎంసీలకు గానూ 13.67 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. ఎగువ నుంచి భారీ వరదలు వస్తుండడంతో ప్రాజెక్టులో కుషన్ పెడుతున్నారు. మేడిగడ్డ వద్ద 8.03 లక్షలు, సమ్మక్కసాగర్ వద్ద 7.11 లక్షలు, సీతమ్మసాగర్ వద్ద 9.54 లక్షల క్యూసెక్కుల వరదను వదిలేస్తున్నారు. దీంతో భద్రాచలం వద్ద 45.55 మీటర్ల ఎత్తులో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. 8.79 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. అక్కడ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.

**మీడియం ప్రాజెక్టులూ నిండుకుండల్లా..**

గోదావరి, కృష్ణా బేసిన్లోని మీడియం ప్రాజెక్టులు కూడా నిండుకుండల్లా మారాయి. డిండి, మూసీ, పాకాల, కోటిపల్లి వాగు, వైరా, లంకాసాగర్ వంటి మధ్య తరహా ప్రాజెక్టులన్నీ మొన్నటి వరదలకు ఫుల్ రిజర్వాయర్ లెవెల్కు చేరాయి. గోదావరి బేసిన్లోని ప్రధానమైన మీడియం ప్రాజెక్టులన్నీ ఫుల్ అయిపోయాయి. అప్పర్మానేరు ప్రాజెక్టు ఫుల్ కెపాసిటీకి చేరింది. నల్లవాగు, సాత్నాల, మత్తడివాగు, స్వర్ణ, వట్టివాగు, గడ్డెన్నవాగు, ఎన్టీఆర్ సాగర్, కుమ్రంభీం ప్రాజెక్ట్, పెద్దవాగు, గొల్లవాగు, నీల్వాయి, ర్యాళ్లవాగు, బొగ్గులవాగు, లక్నవరం లేక్, రామప్ప లేక్, పాలెం వాగు ప్రాజెక్టులన్నీ జలకళ సంతరించుకున్నాయి. తాలిపేరు, కిన్నెరసాని ప్రాజెక్టులకు ఇంకా వరద ప్రవాహం కొనసాగుతుండడంతో ఆయా ప్రాజెక్టులూ పూర్తి సామర్థ్యంతో కళకళలాడుతున్నాయి.

# మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని విద్యా బోధన చేయాలి...







**-శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్**
**-గురువారం కలెక్టరేట్ లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు**

**వికారాబాద్, శుభ తెలంగాణ:** గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి, వందేమాతర గీతం ఆలాపనతో కార్యక్రమాన్ని ప్రాంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 39 మంది ఉపాధ్యాయులకు శాలువా, మెమోంటో, ప్రశంస పత్రాలతో శాసనమండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి, పరిగి, తాండూర్, చేవెళ్ల శాసనసభ్యులు టి. రామ్మోహన్ రెడ్డి, బి. మనోహర్ రెడ్డి, కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి లతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సభాపతి ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లు విద్యా ప్రాముఖ్యతను గుర్తించి ఎన్నో అద్భుతాలను సృష్టించారన్నారు. ఆ మహనీయులను స్మరించుకుంటూ విద్య పట్ల ఆసక్తిని పెంచాలని సభాపతి తెలిపారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అనే నానుడి ఉంది అంటే ఉపాధ్యాయుల పట్ల సమాజంలో ఎంత గౌరవం ఉంటుందో మనం అర్థం చేసుకోవచ్చని ఆయన అన్నారు. ఏ దేశ భవిష్యత్తు అయిన తరగతి గదుల్లోనే ప్రారంభమవుతుందని, సమాజానికి ఉపయోగపడే గురువుకు మన సమాజంలో ఎంతో గుర్తింపు ఉంటుందని, జీవితాలను మలుపుతిప్పే శక్తి గురువులకే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మనకు విద్యాబోధనలు అందించి, మన ఎదుగుదలకు కారకులైన గురువులను స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని చెబుతూ... తను చదువుకున్న రోజుల్లోనీ జోసెఫ్, లెక్కల మాస్టారును స్పీకర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పాఠశాల స్థాయి నుండి విద్యాబుద్ధులను నేర్పించి ఆర్థికంగా, రాజకీయంగా, ఉన్నత స్థాయి ఉద్యోగులుగా తీర్చి దిద్దిన ఘనత ఉపాధ్యాయులదేనని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 26 వేల పాఠశాలల్లో 20 లక్షల మంది పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని, ఇందులో ఎక్కువగా పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు చదువుకుంటారని ఆయన తెలిపారు.

విద్యాభివృద్ధికై రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తూ బడ్జెట్లో 21 వేల కోట్ల నిధులను కేటాయించడం జరిగిందని స్పీకర్ తెలిపారు. ప్రతి నియోజకవర్గ పరిధిలో 20 ఎకరాలకు స్థలానికి తగ్గకుండా భూములను ఎంపిక చేసి సమీకృత పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూపకల్పన చేస్తుందని ఆయన అన్నారు. ప్రైవేటు రంగాలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని విధాల మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వం విద్య, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తూ.. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి దిశగా తీసుకు వెళ్లేందుకు త్రిసభ్య విద్యా కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెల కోల్పడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపుతున్నారని, పరిశ్రమలు రావడం వల్ల నిరుద్యోగ యువతకు ఎన్నో ఉపాధి అవకాశాలు వస్తాయని ఆయన అన్నారు. ఆడపిల్లలు కూడా విద్య పట్ల ఆసక్తిని పెంచుకోవడంతో పాటు ఉద్యోగాల్లో రాణించేందుకు ముందుకు రావాలని స్పీకర్ సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... జీవితంలో విద్యకు మించింది ఏది లేదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, మార్పులకు అనుగుణంగా తమ జీవితాలను గొప్పగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. దేశ రూపు రేఖలు మార్చాలంటే విద్య వల్లనే సాధ్యమని చెప్పిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటలను కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. తనకు మొట్టమొదటి గురువు తన తల్లియేనని ఆయన అన్నారు. జిల్లాలోని 951 పాఠశాల ఉండగా ఇప్పటికే 250 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని , మిగతా పాఠశాలలో పనులు పురోగతిలో ఉన్నాయని ఆయన తెలిపారు.

శాసనమండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని అన్నారు. తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులే ముందు బాగానా నిలుస్తారని తెలిపారు. ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్ లో చేసిన ఘనత ఉపాధ్యాయులదేననిఆయన అన్నారు.
జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ... సమాజంలో మనము ఎంతటి స్థాయిలో ఉన్నప్పటికీ అలా ప్రభావితం చేసిన ఉపాధ్యాయులే గొప్పవారు అన్నారు. ఉపాధ్యాయులు ఇచ్చినటువంటి చదువు వంటి ఆస్తివలెను ఇతర దేశాల్లో కూడా భారతీయులు మెరుగ్గా పనిచేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పరిగి శాసనసభ్యులు టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ పేద విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకువచ్చే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ప్రభుత్వ పాఠశాలల పిల్లలను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆయన అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల భాగంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించే పనులను మహిళా సంఘాలతో చేపట్టినట్లు ఆయన తెలిపారు.
చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ... ప్రతి ఒక్కరము విద్యార్థి దశ నుండే వచ్చినవారమని, ఉపాధ్యాయులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. ఉపాధ్యాయ వృత్తి అతి పవిత్రమైనదిగా భావించి విద్యార్థుల అభ్యున్నతికి తమ శాయశక్తుల పని చేయాలని ఆయన కోరారు.
తాండూరు శాసనసభ్యులు బి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులను అత్యున్నత స్థాయిలో చేర్చేది ఉపాధ్యాయులేనన్నారు. ఉపాధ్యాయ వృత్తి అంటే గౌరవానికి ప్రతీక అని తెలిపారు.
జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో వికారాబాద్ ఆర్డీవో వాసు చంద్ర, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలి...





**చేవెళ్ల , శుభ తెలంగాణ:** వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని శంకర్పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం అన్ని శాఖల అధికారులతో శంకర్పల్లి మున్సిపల్ కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వినాయక చవితి ఉత్సవాలలో, నిమజ్జనం కార్యక్రమాలలో ఎటువంటి వాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కాగా పత్తేపురం మూసి వాగులో వినాయక విగ్రహాలను నిమర్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లను చేయాలని సూచించారు. వినాయక మండపాల వద్ద ప్రశాంతమైన వాతావరణంలో పూజలు చేసే విధంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రాత్రి సమయంలో ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా డీజే లను, స్పీకర్లను పెట్టకూడదని హెచ్చరించారు. కాగా పత్తేపురం ఫ్లై ఓవర్ పై ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనలను పాటించే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలనిఆదేశించారు. ఫ్లైఓవర్ పై ఐమాక్స్ లైట్లు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, మేనేజర్ అంజన్ కుమార్, ఆర్ అండ్ బి డి ఈ రమేష్, ఏ ఈ చంద్రశేఖర్, ఇరిగేషన్ ఏఈ రాధిక, విద్యుత్ శాఖ ఏఈ ప్రదీప్ కుమార్, ఎస్ ఐ సుందరయ్య, శంకర్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రేవతి రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## దళిత జర్నలిస్ట్ ఫొరం రాష్ట్ర చైతన్య సభ కరపత్రిక ఆవిష్కరించిన గద్వాల్ ఎమ్మెల్యే




దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర చైతన్య మహాసభ కరపత్రికను జోగులాంబ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కరపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ మహాసభ 2024 సెప్టెంబర్ 27న హైదరాబాద్ రవీంద్ర భారతిలో దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కాశపోగు జాన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టుల ఫోరం జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు డి వెంకటన్న,శాంతిరాజు, తాటికుంట తిరుమల్,ఎస్. తిరుమలేష్, మన్నపురం రాముడు,సురేష్,కిరణ్ కుమార్,నాయకులు మాజీ ఎంపీపీ విజయ్ కుమార్,పిడిఎస్యు రాజు,థరూర్ రామన్న,ధర్మ నాయుడు,గోవిందు, భగీరథ వంశీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ,దళిత జర్నలిస్టుల సమాజానికి ఎనలేని సేవలను అందిస్తూ,తమ వాణిని వినిపిస్తూ,సమాజంలో మార్పు తీసుకురావడానికి జర్నలిస్టుల పాత్ర ఎంతగానో అవసరమని అన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలిగా డాక్టర్ స్వర్ణలతకు ఘన సన్మానం




పి.వి. నర్సింహా రావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ డైరీ కళాశాల, కామారెడ్డిలో గత కొన్ని సంవత్సరాలుగా అసిస్టెంట్ ప్రొఫెసర్గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ స్వర్ణలతకు కామారెడ్డి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ప్రశంస పత్రాన్ని అందించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ వేడుకలో ఆమెకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, డాక్టర్ స్వర్ణలత విద్యార్థులకు అంకిత భావంతో పాఠాలు బోధిస్తూ, ఉత్తమ ఉపాధ్యాయురాలిగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఉమాపతి మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రొఫెసర్, ఎమ్మెల్సీ కోదండరాం గారికి జన్మదిన శుభాకాంక్షలు



**(శుభ తెలంగాణ/హైదరాబాద్)** ప్రొఫెసర్ ఎమ్మెల్సీ కోదండరాం సారుకు హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఏఎస్ రావు నగర్ కాంగ్రెస్ నాయకులు,తెలంగాణ ఉద్యమకారులు నాగేశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి,సమాజానికి సేవలు అందించిన కోదండరాం రాజకీయ,సామాజిక రంగాల్లో తన అంకితభావంతో నిలిచారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేస్తూ,ఆయురారోగ్యాలతో సుదీర్ఘ కాలం ప్రజా సేవ కొనసాగించాలని పేర్కొన్నారు.

## వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి అరబిందో ఫార్మా ఐదు కోట్ల విరాళం

వరద బాధితుల సహాయార్థం ప్రఖ్యాత అరబిందో ఫార్మా సంస్థ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5 కోట్లు విరాళం ఇచ్చింది. జూబ్లీ హిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క లను సంస్థ ప్రతినిధులు కలిసి, విరాళం చెక్కును అందజేశారు. సీఎం, డిప్యూటీ సీఎంలను కలిసినవారిలో అరబిందో ఫార్మా వైస్ ప్రెసిడెంట్ నిత్యానంద రెడ్డి , డైరెక్టర్ మదన్ మోహన్ రెడ్డి , సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఐఎస్ఆర్ రావు ఉన్నారు. వరద బాధితులను ఆదుకోవడంలో అరబిందో ఫార్మా సంస్థ చూపిన ఔదార్యాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు.

## బీసీ కుల గణన చేయాలి...

**-జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కే, యాదగిరి యాదవ్**

**వికారాబాద్, శుభ తెలంగాణ:** గురువారం బీసీ కుల గణన చేయాలని జిల్లా కలెక్టర్ కు ,జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కే యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో మెమోరండం ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంఘం చైర్మన్ గొరిగి మల్లేష్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా బీసీలు ఈ కులగనున లేనందున అన్యాయానికి గురైనారన్నారు వెంటనే కులగలనని చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు ఈ విషయాన్ని కలెక్టర్ కు విన్నవించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి పంపిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం యూత్ అధ్యక్షులు నీల వెంకటేష్ రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు జిల్లా పెల్లి అంజి రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి రవి యాదవ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్ శివకుమార్ పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు అందుకున్న ఆర్ కళావతి...

**చేవెళ్ల, శుభ తెలంగాణ:** ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో రాధాక్రిష్ణ జయంతి సందర్భంగా గురుపూజాది నోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం - 2023 అవార్డులను ఆయనతో పాటు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ మరియు జిల్లా విధ్యాశాఖ ఉన్నతాధికారులు అందించారు.

# నకిలీ సర్టిఫికెట్ల దందా

**వరంగల్, శుభ తెలంగాణ :** కాసులు ఇస్తే చాలు కులం ? ఆదాయం, నివాసం, ఫ్యామిలీ మెంబర్, డిపెండెంట్, మనీ లెండరింగ్ సర్టిఫికెట్లు. ఏనీ సర్టిఫికేట్ చిటికెలో అందిస్తున్న నకిలీ ముఠా గుట్టు రట్టైంది. ఫేక్ సర్టిఫికేట్స్ ఛలామణి చేస్తున్న నిందితులను అరెస్ట్ చేశారు పోలీసులు. ఎలాంటి సర్టిఫికెట్ అయినా సరే.. ఆ కేటుగాళ్లకు చేయి తడిపితే నిమిషాల్లో సర్టిఫికెట్ జారీ చేస్తారు. నకిలీ సర్టిఫికెట్ల తయారీలో వాళ్లకు వాళ్ళే సాటి. ఒకటి కాదు రెండు కాదు 650 కి పైగా నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసి రెవెన్యూ అధికారులకు షాక్ ఇచ్చిన కేటుగాళ్లు ఇప్పుడు కటకటాల పాలయ్యారు. ఆ భాగోతం ఎలా బయటపడింది..? ఆ 420 గాళ్లను ఏం చేశారు..?నకిలీ సర్టిఫికెట్ల బాగోతం వరంగల్ ను షేక్ చేసింది.. ఓ ముఠా ఏకంగా తహసిల్దార్ సంతకంతో పాటు నకిలీ స్టాంపులు తయారు చేయించి, ఇంటి నుండే సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ కేటుగాళ్లు జారీ చేసిన నకిలీ సర్టిఫికెట్ల భాగోతం తెలియక సర్టిఫికెట్ రెన్యూవల్ కోసం తహసిల్దార్ కార్యాలయానికి ఓ బాధితుడు వెళ్ళగా అసలు భాగోతం బయట పడింది. నకిలీ అని గమనించిన వరంగల్ తహసీల్దార్ మట్వాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తీగలాగితే డొంక కదిలింది. ప్రధాన సూత్రదారి తోపాటు ఇప్పటివరకు ఎనిమిది మంది అరెస్టు అయ్యారు.వరంగల్ నగరంలోని ఎల్లంబజారుకు చెందిన సతీష్ అనే యువకుడు ఈ బట్టేబాజ్ భాగవతంలో కీలక పాత్రదారుడుగా పోలీసులు గుర్తించారు. కొంతమంది తహసిల్దార్ కార్యాలయంలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో మిలాఖత్ అయి నకిలీ సర్టిఫికెట్ల దందాకు తెర లేపాడు. కాసులు ఇస్తే చాలు కులం ? ఆదాయం, నివాసం, ఫ్యామిలీ మెంబర్, డిపెండెంట్, మనీ లెండరింగ్ సర్టిఫికెట్లు ఇలా నకిలీ సర్టిఫికెట్ల తయారుచేసి ఐదు పదివేల రూపాయలకు విక్రయించినట్లు పోలీసుల విచారణలో తేలింది.కొన్ని సంవత్సరాలుగా ఈ దందా విచ్చలవిడిగా సాగుతూన్నప్పటికీ, రెండు రోజుల క్రితం రెన్యువల్ కోసం వెళ్తే భాగోతం బయటపడింది. బాలాజీనగర్‌కు చెందిన యువకుడు ఫైనాన్స్ వ్యాపారం నిర్వహించాలనుకున్నాడు. ఇందుకు గతంలో ఎల్లంబజార్‌కు




చెందిన సతీష్ వద్ద మనీ లెండరింగ్ కోసం సర్టిఫికెట్ అవసరం ఉండగా 5000 తీసుకొని సర్టిఫికెట్ ఇచ్చాడు. ఆగస్టు నెలలో సర్టిఫికెట్ గడువు ముగియడంతో రెన్యువల్ కోసం వరంగల్ తహసిల్దార్ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తు తీసుకున్న వరంగల్ మండల తహసిల్దార్ ఇక్బాల్ అది నకిలీదని తన సంతకం కాదని గుర్తించారు. ప్రభుత్వ స్టాంపు కూడా తప్పుగా ఉందని గమనించి మట్వాడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.తాను గత సంవత్సరం పని చేసినప్పుడు ఎవరికి కూడా మనీ లెండరింగ్ సర్టిఫికెట్లు ఇవ్వలేదని అది నకిలీ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే కాకుండా చాలామంది వద్ద డబ్బులు తీసుకొని నకిలీ సర్టిఫికెట్లు జారీ చేశారని వారందరిపై చర్య తీసుకోవాల్సిందిగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తహసిల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు తీగ లాగితే డొంక కదిలింది. ఇప్పటివరకు 640 నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అవసరాన్ని బట్టి ఒక్కో సర్టిఫికెట్‌కు ఐదు వేల రూపాయల వరకు వసూలు చేసినట్లు గుర్తించారు.తహసిల్దార్ సంతకాన్ని, ప్రభుత్వ ముద్రను ఫోర్జరీ చేసి నకిలీ ఆదాయం, డిపెండెంట్, ఫ్యామిలీ మెంబర్, మనీ లెండరింగ్ సర్టిఫికెట్లు, వివిధ విలువైన సర్టిఫికెట్స్ క్షణాల్లో జారీ చేసినట్లు గుర్తించారు. నకిలీ సర్టిఫికెట్ల స్కామ్‌లో ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది పాత్రధారులుగా ఈ ఇంత పెద్ద భాగోతం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నకిలీ సర్టిఫికెట్స్ తయారు చేయడానికి సహకరించిన డిటిపి, స్టాంపు వెండర్, సంతకం ఫోర్జరీ, దళారి, నకిలీ సర్టిఫికెట్లు తీసుకున్న వారితో సహా ఎనిమిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్లు ఏసీపీ నందిరామ్ నాయక్ తెలిపారు.

# శ్రీసప్తముఖ మహాశక్తి గణపతి విగ్రహం


**హైదరాబాద్, శుభ తెలంగాణ :** హైదరాబాద్‌లో వినాయకచవితి రోజు కొలువుదీరనున్న ఖైరతాబాద్ గణనాథుడి విగ్రహం పనులు పూర్తి అయ్యాయి. అదే ప్రదేశంలో విగ్రహాన్ని తయారు చేసిన సంగతి తెలిసిందే. సెప్టెంబరు 7న వినాయక చవితి సందర్భంగా గణనాథుడికి తొలి పూజ జరగనున్న సంగతి తెలిసిందే. అందుకు ఇంకా రెండు రోజుల సమయం మాత్రమే ఉంది. విగ్రహం పనులు ఎప్పుడో పూర్తి కాగా.. రంగులు అద్దడం కూడా కళాకారులు పూర్తి చేశారు. ఆఖరి ఘట్టంగా గణనాథుడి కళ్లను నేడు రూపొందించారు. విగ్రహంపైన నేత్రాలను శిల్పి రాజేందర్ తీర్చిదిద్దారు. ఈ ఏడాది 70 అడుగుల ఎత్తులో బడా గణేష్ దర్శనం జరగనున్న సంగతి తెలిసిందే.ఈసారి 70 అడుగుల ఎత్తైన శ్రీసప్తముఖ మహాశక్తి గణపతి విగ్రహాన్ని ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించనున్నా రు. ఖైరతాబాద్ విగ్రహం నెలకొల్పి ఈ ఏడాదికి 70 ఏళ్లు నిండనున్నాయి. అందుకని 70 అడుగుల విగ్రహాన్ని ఈసారి ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహ ప్రధాన శిల్పి చిన్నస్వామి రాజేందర్ నేతృత్వంలో దాదాపు 200 మంది కార్మికులు ఈ 70 అడుగుల విగ్రహాన్ని పూర్తి చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు ప్రధాన శిల్పి స్వామివారికి నేత్రాలంకరణ చేశారు. ఇక మొత్తం విగ్రహ పనులు పూర్తి కావడంతో చుట్టూ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన కర్రలను కూడా తొలగిస్తామని ఉత్సవ కమిటీ కన్వీనర్ సందీప్ రాజ్ వెల్లడించారు.

**రేవంత్ రెడ్డికి ఆహ్వానం**

ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పూజలకు ఆహ్వానించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లిన వారు వినాయక నవరాత్రి ఉత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అర్చకులు ఆశీర్వచనం అందించారు.

**భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే ద్వారా ఆహ్వానం**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లును ఖైరతాబాద్ ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ చైర్మన్ దానం నాగేందర్ ఆహ్వానించారు. ఖైరతాబాద్ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఆయన కోరారు. ప్రజాభవన్ లో పూజారులు, ఉత్సవ మండలి సభ్యులతో కలిసి ఆయన డిప్యూటీ సీఎంను ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఉత్సవాలకు కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరు కావాలని డిప్యూటీ సీఎంను వారు కోరారు.



# చీకటి జీవితాల్లో వెలుగు నింపేది ఉపాధ్యాయులే

**విద్యార్థులను సన్మార్గంలో నడిపించాలి..**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్ , శుభ తెలంగాణ:** చీకట్లో మగ్గుతున్న ఎన్నో జీవితాల్లో వెలుగులు నింపుతున్నది ఉపాధ్యాయులేనని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సంర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులకు అవార్డు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలందరూ పాఠశాలకు వచ్చేలాగా తల్లిదండ్రులను ప్రోత్సహించవలసిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడి పైనా ఉందన్నారు. కొన్ని కారణాల చేత విద్యార్థులను బడికి పంపకుండా పనిలోకి పంపుతారని అలాంటి వారిని గుర్తించి బడిలో చేర్పించాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో ఎక్కువగా బాల్యవివాహాలు జరుగుతాయని, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఈ వివాహాల సమాచారం తెలిసే అవకాశం ఉంటుందని, వారిని గుర్తించి బాల్యవివాహాలు నివారించాలని కోరారు. దానివల్ల చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాట



వేసిన వారవుతారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే కొందరు ఉపాధ్యాయులు వారి స్వంత డబ్బులతో పిల్లలకు ఐడి కార్డులు, టై బెల్ట్ వంటి వస్తువులు కొనిస్తున్నారని, పాఠశాలలోని చిన్నచిన్న మరమ్మతులు చేయిస్తున్నారని తెలిపారు. వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. ఈ మధ్యకాలంలో పాఠశాల విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయని, పిల్లల ప్రవర్తనను ఉపాధ్యాయులు గుర్తించి పెడదోవ పట్టకుండా చూడాలని కోరారు. జిల్లాలో గత ఏడాది పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు రాసిన 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేశారని కొనియాడారు. గుర్తింపుకు నోచుకోని ఎంతో మంది ఉపాధ్యాయులు నిశ్శబ్దంగా వారి సేవలను అందిస్తున్నారని వారికి పాదాభివందనం చేస్తున్నట్లు చెప్పారు.

**పిల్లలకు గురువుతోనే అనుబంధం**

విద్యార్థులకు తల్లిదండ్రుల కంటే గురువుతోనే ఎక్కువ అనుబంధం ఉంటుందని కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ అన్నారు. విద్యార్థులు ఇంటిలో కంటే పాఠశాలలోనే ఎక్కువ సమయం గడుపుతారని తద్వారా గురువుతో అనుబంధం పెరుగుతుందని అన్నారు. రైతులు, ఉపాధ్యాయులు చేసే సేవ వెలకట్టలేనిదని కొనియాడారు. గురువు సూచించే సూచనలు పాటించి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లాలోని 44 మంది ప్రభుత్వ ప్రైవేటు ఉపాధ్యాయులకు అవార్డులో అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పేయి, జిల్లా విద్యాధికారి జనార్ధన్ పాల్గొన్నారు.

# నేత్రదానం పక్షోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఆదిత్య

**పెదకూరపాడు :** నేత్రదాన ఉద్యమంలో పాల్గొనండి.. దృష్టి సందేశ దాత అవుతారని మరణాంతరం మీకళ్ళను దానం చేయవచ్చని 75 త్యాలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ వీర్నాల ఆదిత్య అన్నారు.పెదకూరపాడు మండలంలోని తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని జన చైతన్య సమితి ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఆస్పత్రిలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఆదిత్య మాట్లాడుతూ కొన్ని వేల మంది కంటి చూపు లేక చీకటిలో ఉండిపోతున్నారని వారందరికీ వెలుగులు



ప్రసాదించాలంటే మరణానంతరం ప్రతి ఒక్కరు నేత్రదానం చేసి కంటి చూపు లేనివారికి ప్రసాదించాలని కోరారు.జన చైతన్య సమితి కార్యదర్శి తూల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. జన జనచైతన్య సమితి నిర్వాహకులు షేక్ లియాఖత్ ఆలీ మాట్లాడుతూ నేత్రదానం మనిషి మరణాంతరం మరో ఇద్దరికి చూపునిస్తుందని కేవలం కంటిలోని కార్నియా పురాణం మాత్రమే మరణాంతరం సేకరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ వేలితోటి అనిల్ కుమార్,ఆరోగ్య సిబ్బంది ధనలక్ష్మి, విజయ, చైతన్య, హాఫీజియ తదితరులు పాల్గొన్నారు

## రోజుకో అత్యాచారం, గంటకో అఘాయిత్యం.. ఇదేనా మార్పు ?

**మహిళా భద్రతకు అభయమివ్వని హస్తానికి అధికారమెందుకు**

**మంత్రి సీతక్క ను అడ్డగించి నిలదీసిన మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి**



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఆసిఫాబాద్ జిల్లాకి సంబంధించిన ఆదివాసీ ఆడబిడ్డపై ఆగష్టు 31 న జరిగినట్వంటి అత్యాచారం మరియు హత్య యత్నం ను ఉద్దేశించి ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ధర్నాలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి పిలుపునిచ్చారు. దానిలో భాగంగా ఈరోజు గాంధీ హాస్పిటల్ లో ఉన్న బాధిత మహిళను పరామర్శించడానికి వెళ్లిన శిల్పారెడ్డి బాధిత కుటుంబంతో మాట్లాడి వారికి అండగా ఉంటామని భరోసనిచ్చారు . మహిళ పై జరిగింది హత్యాచారమే అని కుటుంబ సభ్యులు మీడియా సాక్షిగా చెప్పినా మంత్రి సీతక్క ఈ కేసుని పక్కతోవ పట్టించే తీరును నిరసిస్తూ మహిళకి న్యాయం జరగాలని గాంధి హాస్పిటల్ ముందు బైటాయించిన శిల్పారెడ్డి గారు బాధిత మహిళా కుటుంబానికి జరిగిన అన్యాయం ని పక్కతొవ్వ పట్టించడానికి వచ్చిన మంత్రి సీతక్క ని నీలదీసి ఈ సంఘటనను అత్యాచారం మరియు హత్య యత్నం గానే చూడాలని కమ్యూనల్ ఇష్యూ గా చిత్రికరించవద్దని సూటిగా మంత్రిని హెచ్చరించారు. వెంటనే నిందితుడికి ఎస్సీ,ఎస్టీ ి అట్రాసిటీ, అత్యాచార మరియు హత్యయత్నం కేసులు పెట్టి ఉరిశిక్ష విధించి బాధిత మహిళకి న్యాయం చేకూర్చాలని లేనియెడల రాష్ట్ర మహిళా మోర్చా తరుపున ముందు ముందు చెప్పట్టపోయే కార్యక్రమాలు తీవ్రంగా ఉంటాయని శిల్పారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## వరద బాధితులకు వైద్య సేవలు



**ఖమ్మం, శుభ తెలంగాణ :** హెటిరో సంస్థల, సింధు హాస్పిటల్స్ చైర్మన్ రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథి రెడ్డి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో వరద బాధితులకు సింధు హాస్పిటల్స్ బృందాలతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి వైద్య సేవలను ప్రారంభించారు.వరద బాధితుల సహాయార్థం ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ కి కోటి రూపాయల చెక్కును పార్థసారధి రెడ్డి అందించారు.ఉభయ తెలుగు రాష్ట్రాలలో వరద బాధితుల సహాయార్థం రాష్ట్రానికి కోటి రూపాయలు చొప్పున విరాళంగా పార్థసారధి రెడ్డి తెలియజేశారు.ఈ సందర్భంగా..పార్థసారధి రెడ్డి మాట్లాడుతూ..ఖమ్మం జిల్లాలో ప్రకృతి విలయంతో పేద ప్రజలు నిరాశ్రులయ్యారన్నారు.ఈ ప్రాంత వాసిగా నా వంతుగా సహాయం అందించడం నా బాధ్యతగా భావించనన్నారు.మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతు..ఖమ్మం జిల్లా వాసులకు, మన జిల్లాకు ఏ విపత్తు, ఏ ఆపద సంభవించిన నేను ఉన్నానంటూ పార్థసారధి రెడ్డి ఆపన్న హస్తం అందిస్తున్నారాన్నారు. గతంలో కూడా ఖమ్మం జిల్లాకు వరదలు సంభవించినప్పుడు అప్పటి కలెక్టర్ కి కోటి రూపాయలు విరాళం ఇచ్చిన సంగతి అట్లాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రాంతాలలో వరదలు సంభవించినప్పుడు అక్కడ కలెక్టర్ కి కూడా రూ. కోటి రూపాయలు విరాళం అందజేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం కూడా గత కొద్ది రోజులలో ఖమ్మం మరియు పాలేరు ప్రాంతాలను అతలాకుతలం చేసిన తుఫాను ప్రాంతవాసుల సహాయార్థం ఈరోజు ఒక కోటి రూపాయలు విరాళం కలెక్టర్ సంతోషంగా ఉందన్నారు. అలాగే వారు, వారి కుమార్తె జ్ఞాపకార్థం అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునికంగా హైదరాబాదులో నిర్మించిన సింధు హాస్పిటల్ వైద్య బృందాలను, మందులను కలెక్టర్ కి అందుబాటులో ఉంచి వరద ప్రాంతాల్లో వచ్చే వ్యాధులను అరికట్టే విధంగా కూడా వారి వంతు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాలకు ప్రతి రాష్ట్రానికి కోటి రూపాయలు చొప్పున రెండు కోట్ల రూపాయలను విరాళంగా అందజేస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం....

**మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి**

**ఉపాధ్యాయుల కృషి ఫలితంగానే మెరుగైన ఫలితాలు×**

**విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పన**

**ఉత్తమ సేవలు అందించిన 42 మంది ఉపాధ్యాయులకు సన్మానం**

**పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు.**

**పెద్దపల్లి , శుభ తెలంగాణ:** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ , జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణ శ్రీ , అదనపు కలెక్టర్ రెవెన్యూ జి శ్యాంప్రసాద్ లాల్ లతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్యక్రమం ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ తాను ఇంతగా ఎదగడానికి గురువులు నేర్పిన విద్యాబుద్ధుల కారణమని వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు.ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి హోదా వరకు ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించు కుంటున్నామని, మారుమూల ప్రాంతాల్లో విద్యార్థు తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను గుర్తించి వారిని సన్మానించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఉపాధ్యాయ అవార్డు వచ్చిన ఉపాధ్యాయు లను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. ఉపాధ్యాయులు ఈ పాఠశాల నాది ఈ విద్యార్థులు నా వారు అన్న భావనతో పనిచేసినప్పు డు విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు 12 వందల కోట్ల రూపాయలు వెచ్చిచ్చిందని అన్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందున బాధ్యతాయుతంగా పనిచే యాలని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మెరుగుపరి చే విధంగా చర్యలు చేపట్టాలని పాఠశాలలో ఎలాంటి అవసరాలు ఉన్న ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

# పిల్లల్లో ప్రొటీన్ లోపం సమస్యలు?



శరీర కణజాలాల పెరుగుదలకు ప్రోటీన్ చాలా అవసరం. అందులోనూ పిల్లల సరైన ఎదుగుదలకు తగినంత ప్రొటీన్లు తీసుకోవాలి. ఎందుకంటే కండరాల పెరుగుదల నుండి మెదడు పనితీరు వరకు ఇది చాలా అవసరం. దురదృష్టవశాత్తు, ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ప్రోటీన్ లోపం అనేది ఒక సాధారణ సమస్యగా మారింది, ఇది పిల్లల అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది. ఈ సమస్యను పరిష్కరించడానికి, న్యూట్రిషన్ న్యూట్రిషనిస్ట్ ప్రీతి కోర్గాంకర్‌ను ఓ మీడియా సంస్థ ఇంటర్వ్యూ చేసింది, వారు పిల్లల ఆహారంలో ప్రోటీన్ యొక్క ప్రాముఖ్యతను, మాక్రోన్యూట్రియెంట్ సరిపోకపోతే ఏమి జరుగుతుందో వివరంగా వివరించారు. ప్రోటీన్ అమైనో ఆమ్లాలతో రూపొందించబడింది, ఇవి శరీర నిర్మాణ వస్తువులు. ఈ అమైనో ఆమ్లాలు వివిధ శారీరక ప్రక్రియలకు అవసరం, వీటిలో: కండరాల పెరుగుదల: కండరాల కణజాల పెరుగుదలకు ప్రోటీన్ అవసరం. బాల్యంలో, పెరుగుదల వేగంగా ఉన్నప్పుడు, ప్రోటీన్ యొక్క స్థిరమైన సరఫరా అవసరం. మెదడు పనితీరు: మెదడు కణాల మధ్య సంభాషణను సులభతరం చేసే రసాయనాలు ప్రోటీన్లు. పెరుగుదల, అభ్యాసం, జ్ఞాపకశక్తికి తగినంత ప్రోటీన్ తీసుకోవడం అవసరం. రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది: ప్రొటీన్ లేకపోవడం వల్ల ఇన్‌ఫెక్షన్‌తో పోరాడే పిల్లల సామర్థ్యాన్ని బలహీనపరుస్తుంది. హార్మోన్ ఉత్పత్తి: ప్రోటీన్ లోపం హార్మోన్ల అసమతుల్యతకు దారితీస్తుంది, ఇది మొత్తం పెరుగుదలను ప్రభావితం చేస్తుంది. పిల్లలలో ప్రోటీన్ లోపం వివిధ మార్గాల్లో వ్యక్తమవుతుంది. అయితే తల్లిదండ్రులు ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా గుర్తించాలి. అటువంటి కొన్ని సాధారణ సూచికలు ఇక్కడ ఉన్నాయి: బరువు : పిల్లలు కుంగిపోయినప్పుడు లేదా బరువు పెరగడంలో విఫలమైనప్పుడు పిల్లలలో ప్రోటీన్ లోపం తెలుస్తుంది. ఎముకలు, కండరాలు, ఇతర కణజాలాల పెరుగుదలకు ప్రోటీన్ అవసరం, దాని లోపం నెమ్మదిగా పెరుగుదలకు కారణమవుతుంది. బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ: ప్రోటీన్ లోపం ఉన్న పిల్లలు అంటువ్యాధులు, వ్యాధులకు ఎక్కువ అవకాశం ఉంది. బలహీనమైన రోగనిరోధక శక్తి కారణంగా, వారు తరచుగా జలుబు, శ్వాసకోశ సమస్యలు, ఇతర వ్యాధులను పొందుతారు. అలసట: ప్రోటీన్ శక్తికి మూలం, కాబట్టి తగినంత ప్రోటీన్ తీసుకోవడం దీర్ఘకాలిక అలసట, శారీరక శ్రమను తగ్గిస్తుంది. పిల్లల్లో నీరసం పెరగవచ్చు. జుట్టు, చర్మం, గోళ్ల సమస్యలు: ప్రోటీన్ లోపం పిల్లల జుట్టు, చర్మం, గోళ్ల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. జుట్టు విరగడం లేదా సన్నబడటం, పొడి, పొలుసుల చర్మం, బలహీనమైన లేదా విస్తరించిన గోర్లు సంభవించవచ్చు. ఆలస్యమైన గాయం నయం: ప్రోటీన్ లోపం ఉన్న పిల్లలలో గాయాలు నయం కావడానికి సమయం పట్టవచ్చు. కాబట్టి, పిల్లలలో ప్రోటీన్ లోపాన్ని నివారించడానికి, మంచి మొత్తంలో ప్రోటీన్ కలిగిన సమతుల్య ఆహారం తీసుకోవాలి. ఎలా ఇక్కడ ఒక సాధారణ పరిష్కారం ఉంది. బేబీ డైట్‌లో ప్రోటీన్-రిచ్ ఫుడ్స్‌ను చేర్చండి: మీ బేబీ డైట్‌లో లీన్ మాంసాలు, పౌల్ట్రీ, చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు, బీన్స్, కాయధాన్యాలు, గింజలు, తృణధాన్యాలు వంటి వివిధ రకాల ప్రోటీన్-రిచ్ ఫుడ్‌లను చేర్చండి. ప్లస్ క్వినోవా వంటి మొక్కల ఆధారిత ప్రోటీన్లు అద్భుతమైన వనరులు.

# నీటిలో రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తినాల్సిన డ్రై ఫ్రూట్స్



డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. అవి పుష్కలంగా ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ కలిగి ఉంటాయి. అయితే డ్రై ఫ్రూట్స్‌ని రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తింటే దాని ప్రయోజనాలు మరింత పెరుగుతాయని మీకు తెలుసా. ఏ 5 డ్రై ఫ్రూట్స్‌ను రాత్రంతా నానబెట్టి తినాలి..? బాదంపప్పు: బాదంపప్పులో విటమిన్ ఇ, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. బాదంపప్పును రాత్రంతా నానబెట్టడం వల్ల అవి మృదువుగా మారతాయి మరియు వాటిలోని పోషకాలు సులభంగా జీర్ణమవుతాయి. బాదంపప్పు తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది, మెదడు పనితీరు పెరుగుతుంది మరియు బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది.వాల్‌నట్స్: వాల్‌నట్స్‌లో గుండెకు చాలా మేలు చేసే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా ఉంటాయి. వాల్‌నట్‌లను రాత్రంతా నానబెట్టడం వల్ల వాటిని మృదువుగా, సులభంగా తినవచ్చు. వాల్ నట్స్ తినడం వల్ల మెదడు పనితీరు పెరుగుతుంది. ఒత్తిడి తగ్గుతుంది, ఎముకలు బలపడతాయి. అత్తి పండ్లు: అత్తి పండ్లలో ఫైబర్, కాల్షియం, పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. అత్తి పండ్లను రాత్రంతా నానబెట్టడం ద్వారా అవి మృదువుగా, సులభంగా తినవచ్చు. అంజీరా పండ్లను తినడం వల్ల మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. ఎముకలు బలపడతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది.కిస్‌మిస్: ఎండుద్రాక్షలో ఐరన్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. రాత్రంతా నానబెట్టినప్పుడు ఎండుద్రాక్ష ఉబ్బుతుంది. దాని రుచి కూడా మెరుగుపడుతుంది. ఎండుద్రాక్ష తినడం వల్ల రక్తహీనత నయమవుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఎముకలు బలపడతాయి.జీడిపప్పు: జీడిపప్పులో ప్రొటీన్లు, విటమిన్ బి, జింక్ పుష్కలంగా ఉంటాయి. జీడిపప్పును రాత్రంతా నానబెట్టడం వల్ల వాటిని మెత్తగా, సులభంగా తినవచ్చు. జీడిపప్పు తినడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. మెదడు పనితీరు పెరుగుతుంది.

# ప్యాకేజ్డ్ జ్యూస్‌లు హానికరం..




ప్యాకేజ్డ్ జ్యూస్‌లు హానికరం, 'ఆరోగ్యకరమైన' బ్రాండింగ్‌తో సంబంధం లేకుండా, నిపుణులు హెచ్చరిస్తున్నారు ప్యాకేజ్డ్ జ్యూస్‌లు, "ఆరోగ్యకరమైనవి" అనే లేబుల్‌తో వచ్చేవి కూడా ఆరోగ్యానికి ప్రమాదకరం, పోషక విలువలు తక్కువగా ఉన్నాయని నిపుణులు మంగళవారం హెచ్చరిస్తూ, వాటిని నివారించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. జాతీయ పోషకాహార వారోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 1 నుండి సెప్టెంబర్ 7 వరకు నిర్వహిస్తారు. ఈ సంవత్సరం థీమ్ 'అందరికీ పోషకమైన ఆహారం'. ప్యాక్ చేయబడిన జ్యూస్‌లు సాధారణంగా తక్కువ పండ్ల గుజ్జును కలిగి ఉంటాయి, వాటి అధిక చక్కెర కంటెంట్ కారణంగా అనారోగ్యకరమైనవి, మధుమేహం, ఊబకాయం ప్రమాదాన్ని కలిగిస్తాయి ం దేశంలో పెరుగుతున్న ఆరోగ్య సమస్య. ప్రాసెస్ చేసిన రసంలో ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు కూడా లేవు. "ప్యాకేజ్డ్ జ్యూస్‌లు అస్సలు ఆరోగ్యకరమైనవి కావు. వాటిలో చక్కెరలు ఎక్కువగా ఉంటాయి, పోషక విలువలు తక్కువగా ఉంటాయి. పోషకాహారం విషయానికి వస్తే, పండ్ల గుజ్జు శాతం తక్కువగా ఉంటుంది, అయితే కృత్రిమ రుచులు, స్టెబిలైజర్లు, చక్కెర / స్వీటెనర్లు / ఫ్రక్టోజ్ సిరప్ సాధారణంగా చాలా ఎక్కువగా ఉంటాయి, "అని షాలిమార్ బాగ్ ఫోర్టిస్ హాస్పిటల్ యూనిట్ హెడ్- డైటెటిక్స్ డాక్టర్ శ్వేతా గుప్తా మీడియాకి చెప్పారు. ముఖ్యంగా, గుప్తా కూడా జ్యూస్‌లకు బదులుగా తాజా పండ్లను తీసుకోవాలని సిఫార్సు చేశాడు (రెండు తాజావి/ప్యాకేజ్ చేయబడినవి). ఎందుకంటే "రసాన్ని తయారుచేసినప్పుడు, గుజ్జు తీసివేయబడుతుంది, దానిలోని విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్‌లు కూడా తొలగించబడతాయి. అందువల్ల, మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి జ్యూస్‌లను, ముఖ్యంగా ప్యాక్డ్ జ్యూస్‌లను నివారించండి", అని నిపుణుడు చెప్పారు. బదులుగా, విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్ల సమతుల్య మిశ్రమాన్ని అందించే తాజా పండ్లను తినాలని నిపుణుడు పిలుపునిచ్చారు. "వారి ఆరోగ్యకరమైన బ్రాండింగ్ ఉన్నప్పటికీ, ప్యాక్ చేయబడిన పండ్ల రసాలు తరచుగా జోడించిన చక్కెరలతో లోడ్ చేయబడతాయి, మొత్తం పండ్లు అందించే అవసరమైన పోషకాలు, ఫైబర్‌లను తీసివేయబడతాయి. అదనంగా, ఈ రసాలను తయారు చేయడంలో ఉండే ప్రాసెసింగ్ తరచుగా ప్రయోజనకరమైన ఎంజైమ్‌లను నాశనం చేస్తుంది, ఉత్పత్తి యొక్క మొత్తం నాణ్యతను తగ్గిస్తుంది" అని సగ్గు చెప్పారు.

# మెదడుపై మంకీపాక్స్ వైరస్ ప్రభావం



ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మంకీపాక్స్ వైరస్ కేసులు పెరుగుతున్నాయి. మంకీపాక్స్ ఒక వైరల్ వ్యాధి, ఇది ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తుంది. సాధారణంగా ఈ వ్యాధి కొన్ని రోజుల్లో నయమవుతుంది, కానీ కొన్ని సందర్భాల్లో ఇది తీవ్రమైన సమస్యలను కూడా కలిగిస్తుంది. కోతి వ్యాధి ప్రారంభంలో, శరీరంలో జ్వరం , దద్దుర్లు కనిపిస్తాయి. దీని తరువాత, దద్దుర్లు శరీరం అంతటా వ్యాపిస్తాయి. మంకీపాక్స్ నరాల సంబంధిత సమస్యలను అంటే మెదడు సంబంధిత వ్యాధులకు కూడా కారణం కావచ్చు. దీని వల్ల మెదడువాపు, మెనింజైటిస్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. మంకీపాక్స్ వైరస్ సోకిన రోగి యొక్క నాడీ వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుందని ఫోర్టిస్ హాస్పిటల్ న్యూరాలజీ విభాగం ప్రిన్సిపల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ గుప్తా చెప్పారు. ఇది నరాల సంబంధిత సమస్యలను కలిగిస్తుంది. దీని వల్ల మెదడువాపు వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. ఈ సమస్య మెదడులో వాపును కలిగిస్తుంది. దీని కారణంగా రోగి తలనొప్పి , జ్వరం వంటి సమస్యలను ఎదుర్కొంటారు. ఇది కాకుండా, మెనింజైటిస్ కూడా సంభవించవచ్చు. ఇందులో, రోగి మెదడు , వెన్నుపాము చుట్టూ ఉన్న పొర వాపు ప్రారంభమవుతుంది. డాక్టర్ ప్రవీణ్ గుప్తా ప్రకారం, మంకీపాక్స్ వైరస్ రోగి యొక్క చర్మం , శ్వాసకోశంపై ప్రభావం చూపుతుంది, అయితే కొంతమంది రోగులలో, ఈ వైరస్ వారి నాడీ వ్యవస్థపై కూడా తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది, ఇది నాడీ వ్యవస్థ , మెదడు యొక్క కణాలకు నష్టం కలిగిస్తుంది. వాపు ఏర్పడుతుంది. మంకీపాక్స్‌తో బాధపడుతున్న రోగులలో రోగనిరోధక ప్రతిస్పందన కారణంగా కొన్నిసార్లు నాడీ వ్యవస్థ కూడా దెబ్బతింటుంది. అయినప్పటికీ, మంకీపాక్స్ యొక్క నాడీ సంబంధిత ప్రభావాలు తక్కువగా ఉంటాయి.

# శాఖాహారులకు సూపర్ ఫుడ్!




మీ ఎముకలు, కండరాలు, బలం వృద్ధాప్యం వరకు చెక్కుచెదరకుండా ఉండాలంటే మీరు గుడ్లు, మాంసం, చేపలు మాత్రమే తినాల్సిన అవసరం లేదు. మీరు వెజ్ ఫుడ్స్ నుండి ప్రొటీన్, కాల్షియం, అనేక రకాల విటమిన్లను కూడా పొందవచ్చు. ప్రోటీన్, కాల్షియం, విటమిన్ల పవర్‌హౌస్ అని పిలువబడే పల్స్ గురించి ఇక్కడ మేము మీకు చెప్పబోతున్నాం. చిన్న పిల్లల నుండి రోగుల వరకు వృద్ధుల వరకు అందరూ దీనిని తినవచ్చు. అదెంటో ఇప్పుడు పూర్తిగా తెలుసుకుందాం. మూంగ్ పప్పు ప్రోటీన్ గొప్ప మూలం మాత్రమే కాకుండా అనేక ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలను కలిగి ఉంటుంది. ఇది శాఖాహార ఆహారంలో ముఖ్యమైన భాగం. శాకాహారులకు మూంగ్ పప్పు ఎందుకు ఉత్తమం.. దాని ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఈ కథనంలో చూద్దాం. బీన్స్ ప్రోటీన్ గొప్ప వనరులలో ఒకటి. ఒక కప్పు మూంగ్ పప్పులో దాదాపు 14-16 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఇది శాఖాహారులకు అవసరమైన ప్రొటీన్‌లో ఎక్కువ భాగాన్ని తీర్చగలదు. శరీర కండరాల పెరుగుదల, పునర్నిర్మాణానికి ప్రోటీన్ అవసరం. కాబట్టి శాకాహారులు తమ ఆహారంలో చంద్రుడిని చేర్చుకోవడం ప్రయోజనకరం. మూంగ్‌ని క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చుకోవడం వల్ల కండరాలు బలపడతాయి. శరీరంలోని ఇతర ప్రొటీన్ అవసరాలు తీరుతాయి. మూంగ్ పప్పు జీర్ణక్రియ పరంగా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. తరచుగా కొన్ని ప్రోటీన్ ఆహారాలు జీర్ణం కావడం కష్టం. దీని వలన కడుపు నొప్పి వస్తుంది. కానీ మూంగ్ పప్పు తేలికైనది. సులభంగా జీర్ణమవుతుంది. మూంగ్‌లో ఉండే పీచు కారణంగా జీర్ణక్రియ సాఫీగా సాగి కడుపు సంబంధిత రుగ్మతలు రావు. మూంగ్ పప్పును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు తగ్గుతాయి. జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. ముంగ్ బీన్స్‌లో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. ఇవి బరువు నియంత్రణకు గొప్ప ఎంపిక. శాకాహార ఆహారంలో కేలరీలు, కొవ్వు పరిమాణాన్ని నియంత్రించడం చాలా ముఖ్యం. మూంగ్ అనేది తక్కువ కేలరీల ఆహారం. ఇది బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది. దీనితో శాఖాహారులు వారి ఆహారం నుండి అవసరమైన ప్రోటీన్లను పొందుతారు. వారి శరీర అవసరాలు నెరవేరుతాయి. మూంగ్ పప్పు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ రక్తపోటును అదుపులో ఉంచి గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. శాఖాహారం ఆహారంలో తరచుగా గుండె-ఆరోగ్యకరమైన పోషకాలు ఉండవు. కానీ ముంగ్ బీన్స్ సహాయపడుతుంది. మూంగ్ పప్పు రెగ్యులర్ వినియోగం గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. శరీరం మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110